బీపీటీ బ్లాక్

- నల్లబజారులో వరి విత్తనాలు
- కొరత పేరుతో బహిరంగ మార్కెట్లో దందా
- అవకాశం ఉన్నంత వరకు రైతుల నుంచి దోపిడీ
- డీసీఎంఎస్ కేంద్రాల్లోనూ అధిక ధరకు అమ్మకాలు



- విత్తనాల బస్తాలను బండిపై తీసుకు వెళుతున్న రైతు
- నారుమడి సిద్ధం చేసుకుంటున్న రైతు

అడపాదడపా వర్షాలు పడుతున్నాయి.. పదునెక్కిన పొలాల్లో వరి సాగుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. విత్తనాలు, ఎరువులను డిమాండ్‌కు అనుగుణంగా సిద్ధం చేయాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదు. ఇదే అవకాశంగా రైతులను అందినకాడికి దోచుకోవడానికి వ్యాపారులు సిద్ధమయ్యారు. వరిలో డిమాండ్ ఉండే బీపీటీ రకం విత్తనాలను బ్లాక్ చేసేశారు. కొరత పేరుతో అధిక ధరకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ శాఖల తరపున అమ్మకాలు జరుపుతున్న కేంద్రాల్లోనూ దోపిడీ తప్పడంలేదు. విత్తనాల కొరత పేరుతో అదనపు ధరకు విక్రయిస్తున్నా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు పట్టించుకోకపోవడంతో విత్తనాల నల్లబజార్ వ్యాపారం జోరుగా సాగిపోతోంది. ఖరీఫ్‌కు ఆర్‌బీకేలు రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాలపై ఇండెంట్లు పంపలేదు. మార్కెటింగ్ శాఖ ప్రతి ఏడాది అమ్మకాలు జరిపే పరిమాణాలను దృష్టిలో ఉంచుకుని విత్తనాలను ఆయా విక్రయ కేంద్రాలకు పంపారు. అయితే ఇక్కడా అధిక రేట్లు తప్పడంలేదు.. రైతులు దోపిడీకి గురవుతున్నా పట్టించుకోవడంలేదు. 25 కిలోల బస్తాకు అదనంగా రూ.50 నుంచి రూ.100 వరకు అవకాశం ఉన్నంత వరకు రైతుల దగ్గర నుంచి దోచేస్తున్నారు.

14,275 క్వింటాళ్ల విత్తనాలు అవసరం

కృష్ణా పశ్చిమ డెల్టాలో ఖరీఫ్ సందడి వచ్చేసింది. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో 5.71 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంటుంది. ఒక్కో ఎకరాకు 20 కిలోల వరకు వరి విత్తనాలు అవసరం. ఎలుకల బెడద, ఇతర కారణాలతో నారు దెబ్బతినిపోతుందన్న ముందుచూపుతో రైతులు ఎకరాకు 25 కిలోల బస్తా తీసుకుంటున్నారు. 5.71 లక్షల ఎకరాలకు 25 కిలోల చొప్పున 14,275 క్వింటాళ్ల వరి విత్తనాల అవసరం ఉంది. అయితే ఆ మేరకు రైతు భరోసా కేంద్రాల నుంచి కానీ వ్యవసాయ శాఖ నుంచి కానీ ప్రభుత్వానికి ఇండెంట్ పంపలేదని సమాచారం. వ్యపారులు విత్తన కొరత సృష్టించడంతో రైతుల్లో ఆందోళన మొదలైనా వ్యవసాయ శాఖ అధికారుల్లో చలనం లేదు.

తెనాలి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు వ్యవసాయ శాఖ విత్తన అవసరాలు ఎంతనేది గుర్తించి ఏపీ సీడ్స్, ప్రైవేటు కంపెనీల ద్వారా విత్తనాలను రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దీనిని విస్మరించి రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా అని చెప్పి కాలం గడిపారు. ఈ ఏడాది కూడా అదే తీరును చేయడంతో వ్యాపారుల పంట పండింది. తమ అవసరాలకు అనుగుణంగా విత్తనాలు అందవేమోనని రైతులు గాబరా పడుతుండగా.. అధికారులు ఆ విషయం తమకు సంబంధించినది కాదన్నట్లుగా ఉన్నారు. ఇదే అవకాశంగా వ్యాపారులు విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లుగా సబ్సిడీలను ఎగ్గొట్టేందుకు ఆర్‌బీకేల ద్వారా విత్తన విక్రమాలను చేపట్టింది. ఆర్బీకేల ద్వారా విత్తన విక్రయాలు తూతూమంత్రంగా చేపట్టారు. దీనిని ఆసరా చేసుకుని బయటి వ్యాపారులు ఇష్టానుసారంగా అధిక ధరలకు విత్తనాలను విక్రయించడం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం విత్తనాల కొరత అంతగా లేకపోయినా వ్యాపారులు విత్తన కొరతను సాకుగా చూపి రైతులను దోచేస్తున్నారు. వారిదగ్గర ఉన్న విత్తనాల్లో ఎక్కువ డిమాండ్ ఉన్న బీపీటీ విత్తనాలను అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీపీటీ 5204, ఎంటీయూ 1262, 1224, 1061 రకాలను ఎక్కువగా పండిస్తున్నారు. అయితే వీటిలో బీపీటీ విత్తనాలకే నల్లబజార్ వ్యాపారం ఎక్కువగా సాగుతోంది. మార్కెటింగ్ శాఖ ద్వారా డీసీఎంఎస్ కేంద్రాల్లో గత ఖరీఫ్‌కు 25 కిలోల బీపీటీ 5204 విత్తనాల బస్తా రూ.1030కి అమ్మితే, ఈ ఏడాది రూ.1100 చేశారు. ఒక సీజన్‌కే బస్తాకు రూ.70 పెంచేశారు. దీనితో సరిపెట్టుకుందామనుకుంటే, కొన్ని కేంద్రాల్లో రైతుల అవసరాలను అదనుగా చేసుకుని బస్తాకు రూ.50 నుంచి రూ.100కిపైగా అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. అదేమని రైతులు ఎవరైనా అడిగితే అవన్నీ మా జేబులోకి వెళ్లవని, పైవారికి పంపాలని చెప్పిమరీ వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. బీపీటీ రకాల్లో కూడా కరీంనగర్, వరంగల్ ప్రాంతాల విత్తనాలకు తక్కువ డిమాండ్ ఉంటే, నంద్యాల రకాలకు మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో కరీంనగర్, వరంగల్ విత్తనాలను బస్తాపై రూ.50కి అదనంగా అమ్మేస్తుంటే, నంద్యాల రకాలను మాత్రం నిలబెట్టి రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల, తెనాలి, పొన్నూరు ప్రాంతాల్లోని కేంద్రాల్లో ఈ అధిక రేట్ల దోపిడీ సాగుతోందనేది రైతుల మాట. దుగ్గిరాలలో రూ.100 చొప్పున అదనంగా ఇవ్వాల్సిందేనని సిబ్బంది డిమాండ్ చేయటంతో సోమశేఖర్ అనే రైతు బిల్లు కావాలని కోరగా సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. ఇక వ్యాపారులు ఒక్కో రైతు దగ్గర ఒక్కోరేటు తీసుకుంటున్నారు. ఏ రకం విత్తనాలకయినా రూ.100 అదనంగా తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు.





సాధారణంగా.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నకిలీలు ఉంటాయి. ఈ నకిలీలను పసిగట్టాల్సిన.. అరికట్టాల్సిన.. వ్యవసాయ శాఖ కూడా నకిలీ మయంగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. నకిలీలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన వ్యవసాయ అధికారులు కూడా నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు వెలగబెడుతున్నారంటే ఆశ్చర్యం కాదు. ఇలాంటి వారు రైతులకు వ్యవసాయ పాఠాలు ఏవిధంగా చెప్తారో ఎవరికీ తెలియదు. పదో తరగతి ఫెయిలై.. ఇంటర్‌లో ఎంపీసీ చదివిన వారు కూడా ఏజీబీఎస్సీ సర్టిఫికెట్లు పొంది ఏవోలుగా ఉద్యోగాలు సాధించారు. పదో తరగతి పాసై.. ఇంటర్‌లో బైపీసీ చదివిన వారికే ఏజీబీఎస్సీ చదివే అవకాశం ఉంటుంది. అయితే అలాంటిదేమీ లేకుండా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని యూనివర్సిటీల్లో ఏజీబీఎస్సీ చదివినట్లుగా సర్టిఫికెట్లు పుట్టించి ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఉద్యోగాలు సాధించారు. వీరిపై గత టీడీపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించగా.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పట్టించుకోలేదు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు సాధించిన పలువురు ఏవోలుగా ఏడీఏలుగా ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఏవోల్లోనూ.. నకిలీలు

- సాగంటే తెలియని అధికారులు
- ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర డిగ్రీలతో ఉద్యోగాలు
- ఎంపీసీ.. పది ఫెయిలైనా ఏజీబీఎస్సీ సర్టిఫికెట్లు
- ఆ సర్టిఫికేట్లతో ఉద్యోగోన్నతులతో అర్హులకు అన్యాయం
- విచారణ నివేదికను బుట్టదాఖలు చేసిన వైసీపీ ప్రభుత్వం

గుంటూరు సిటీ, జూన్ 25: ఖరీఫ్.. రబీ అంటే ఏమిటో వారికి తెలియదు. భూమిలో ఉండాల్సిన పోషకాలు ఎన్నో అసలే ఎరుగరు. పది మంది రైతులను కూర్చోబెట్టి పట్టుమని పది నిమిషాలు పంటల సాగుపై అవగాహన కల్పించలేరు. అయినా వారు ఏవో(అగ్రికల్చర్ ఆఫీసర్, వ్యవసాయ అధికారులు)లు అయ్యారు. కొందరు ఏడీఏ(అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్)లు కూడా అయ్యారు. వీరంతా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో ఏజీబీఎస్సీ(అగ్రికల్చర్ బీఎస్సీ)లు చదివినట్లు డిగ్రీలు పుట్టించి దొడ్డిదారిలో ఇక్కడ ఉద్యోగాలు పొందారు. కొందరు ఇంటర్‌లో ఎంపీసీ చదివినా ఆ తదుపరి ఏజీబీఎస్సీ చదివినట్లుగా డిగ్రీలు తెచ్చారు. కొందరు పదో తరగతి తప్పినా కూడా ఏజీబీఎస్సీ చదివినట్లు సర్టిఫికెట్‌లు పుట్టించి ఉద్యోగాలు కొట్టేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం ఈ బాపతు ఏవోలే ఎక్కువ మంది ఉన్నారు. 2018లో వీరిపై అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం విచారణకు కమిటీ వేయగా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నివేదికను బుట్టదాఖలు చేసినట్లు తెలుస్తోంది. అనర్హులు అందలాలు ఎక్కడంతో అర్హులైన వారు ఇంకా వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులుగానే మగ్గిపోతున్నారు.

తేలికగా డిగ్రీలు

మన రాష్ట్రంలోని వ్యవసాయ కళాశాలల్లో ఏజీబీఎస్సీ సీటు రావడం చాలా కష్టం. ఒక వేళ సీటు వచ్చినా నాలుగేళ్లు చదివి 156 పరీక్షలు రాస్తేనే డిగ్రీ వస్తుంది. ఇంత కష్టం మనం ఎక్కడ పడతాములే అనుకున్న వారు ఉత్తరప్రదేశ్(ఆగ్రా యూనివర్సిటీ), మహారాష్ట్ర(బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ) నుంచి తేలిక పద్ధతిలో డిగ్రీలు తెచ్చుకున్నారు. అక్కడ సాయంత్రం కాలేజ్ పేరుతో ఈ చదువులు సాగాయి. వాస్తవానికి ఏజీబీఎస్సీ చదవాలంటే ఇంటర్‌లో బైపీసీ చదవాలి. పొరుగు రాష్ట్రాల యూనివర్సిటీల నుంచి డిగ్రీలు పొందిన వారు ఇంటర్‌లో ఎంపీసీ చదివినా ఏజీబీఎస్సీ చదివినట్లుగా డిగ్రీలు ఇచ్చారు. కొందరు అసలు పదో తరగతి కూడా చదవకుండానే డిగ్రీని పట్టేశారు.

విచారణ లేకుండానే..

నకిలీ డిగ్రీలతో వ్యవసాయ అధికారులుగా ఉద్యోగాలు పొందిన వారంతా ఒకే వర్గానికి చెందిన వారు. ఉమ్మడి జిల్లాలో 19 మంది ఈ బాపతు వారే ఉన్నారు. అప్పట్లో రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఉద్యోగాలు



పొందారు. వాస్తవానికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చాక పోలీసు విచారణ ఉంటుంది. వీరి విషయంలో అటువంటిదేమీ జరగలేదని సమాచారం. కనీసం ఏజీబీఎస్సీ సర్టిఫికెట్‌లు ఇచ్చిన యూనివర్సిటీలు ఉన్నాయా లేదా అని కూడా విచారించిన నాధుడు లేడు. నకిలీ సర్టిఫికెట్లతో కొందరు వ్యవసాయ అధికారులుగా ఉద్యోగాలు పొందడంపై 2018లో పెద్ద దుమారం రేగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పద్ధతిలో 175 మంది ఉద్యోగాలు పొందడంపై ఏజీబీఎస్సీ చదివిన విద్యార్థులు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆందోళనకు దిగారు. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం అమృతకుమార్ కమిటీని నియమించింది. దాంతో పాటు త్రీ మెన్ కమిటీని ఏర్పాటు చేసింది. సీఐడీ కూడా దర్యాప్తు ప్రారంభించింది. అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలినట్లు సమాచారం. ఇంతలో ప్రభుత్వం మారడంతో విచారణ నివేదికలు బుట్టదాఖలయ్యాయి.

అన్నీ పెద్ద తలలే..

అసలు వైద్యం తెలియని వ్యక్తి డాక్టర్ అవతారం ఎత్తితే ఎంత ప్రమాదం జరుగుతుందో.. అర్హత లేని వ్యక్తి వ్యవసాయ అధికారిగా చెలామణి అయితే అంత కంటే ఎక్కువ ప్రమాదం జరుగుతుంది. అయినా వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లోని కొందరు పెద్ద అధికారులు నకిలీ వ్యవసాయ అధికారులు కేసును నీరుగార్చడంలో ప్రధాన పాత్ర పోషించారన్న ఆరోపణలున్నాయి. యూనియన్‌కు చెందిన ఓ నాయకుడి సతీమణి కనుసన్నల్లోనే ఇతర రాష్ట్రాల యూనివర్సిటీలు అడ్మిషన్లు ఇస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. వారే ఊరు పేరులేని యూనివర్సిటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కేసు విచారణ ముందుకు సాగకుండా ఉండేందుకు అప్పట్లో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు చెబుతున్నారు.

తీరని అన్యాయం

నకిలీ డిగ్రీలతో కొందరు వ్యవసాయ అధికారులుగా ఉద్యోగాలు పొందడం వల్ల అర్హులైన వారికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. నకిలీ డిగ్రీతో ఉద్యోగం పొందిన వారిలో కొందరు ఏడీఏలుగా కూడా ఉద్యోగోన్నతి పొందారు. వాస్తవానికి మన రాష్ట్రంలో ఏజీబీఎస్సీ చదివిన వారికి ఎక్కువ మార్కులు ఉన్నప్పటికీ, పక్క రాష్ట్రాల డిగ్రీలకు ఎక్కువ గ్రేడ్ పాయింట్లు ఉన్నట్లుగా చూస్తుండటంతో ఉద్యోగోన్నతుల్లో ఇక్కడ చదివిన వారికి అన్యాయం జరుగుతోందంటున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 45 మంది వ్యవసాయ విస్తరణ అధికారులుగా పనిచేస్తున్నారు. వారికి ఎప్పుడో వ్యవసాయ అధికారులుగా ఉద్యోగోన్నతులు రావాల్సి ఉంది. వక్రమార్గంలో వచ్చిన వారి వల్ల వీరికి కూడా అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. టీడీపీ ప్రభుత్వం ఈ వ్యవహారంపై లోతైన విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అక్రమార్కులపై.. చర్యలుండేనా?

వైసీపీ హయాంలో యథేచ్ఛగా తవ్వకాలు ● అక్రమార్కుల బొక్కిన సొమ్మును కక్కిస్తారా



సంగంగోపాలపురం పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేస్తున్న చిత్రం (ఫైల్ ఫోటో)

యడ్లపాడు, జూన్ 25: ఇసుక..మట్టి.. రేషన్ బియ్యం.. అక్రమ మద్యం.. గుట్కా... భూకబ్జాలు.. ఇలా ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమాలకు, దోపిడీలకు అంతేలేదు. వీటిపై టీడీపీ నాయకులు ఆందోళనలు కూడా చేపట్టారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి హెచ్చరికలను ఖాతరు చేయని వైసీపీ నాయకులు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడగా వారికి అధికారులు సహకరించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున అక్రమార్కులు, వారికి సహకరించిన అధికారులపై చర్యలు ఉంటాయని ప్రజలు ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో 50 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు చెరువులుగా మారాయంటే తవ్వకాలు ఏ స్థాయిలో జరిగాయో తెలుసుకోవచ్చు. ఇక చెరువుల సంగతైతే చెప్పనవసరం లేదు. ప్రభుత్వ భూముల్లో 20 నుంచి 30 అడుగుల లోతున నీటి ఊటలు బయట పడేలా తవ్వకాలు చేపట్టారు. పెట్టుబడి లేకుండా అధిక ఆదాయాన్ని తెచ్చి పెట్టే మట్టి, గ్రావెల్ తవ్వకాలపై వైసీపీ నాయకులు దృష్టిపెట్టి సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వ భూములు, చారిత్రక ప్రదేశాలు, కొండ, వాగు పోరంబోకులు, కందకాలను లక్ష్యంగా తీసుకుని మట్టి తవ్వకాలు సాగించారు. చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల పరిధిలోని ప్రభుత్వ, చెరువు, వాగు పోరంబోకు భూముల్లో ప్రజాప్రతినిధి అండతో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరిగాయి. అధికారుల దృష్టికి వచ్చినా ప్రజాప్రతినిధికి భయపడి అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చిలకలూరిపేట మండలం యడవల్లి ప్రభుత్వ భూముల్లో భారీగా మట్టి తవ్వకాలు చేపట్టారు. యడ్లపాడు మండలం సంగంగోపాలపురం పరిధిలోని ప్రభుత్వ భూముల్లో వైసీపీ నాయకులు సాగించిన మట్టి తవ్వకాల దందా అంతా ఇంతా కాదు. మైదవోలు, ఉప్పరపాలెం, కారుచోల చెరువుల్లో వైసీపీ నాయకులు ఇష్టానుసారం తవ్వకాలు సాగించి సొమ్ము చేసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ మూడు చెరువులు నీరు-చెట్టు కింద పూడికతీసి కట్టలను పటిష్టపరిచి అభివృద్ధి చేశారు. తిరిగి అవే చెరువులలో మట్టి తవ్వకాలు చేసి అభివృద్ధి చేసినట్లు బిల్లులు కూడా తీసుకున్నట్లు సమాచారం. అధికారుల పూర్తి సహకారం అందించడం వల్ల వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారు.చారిత్రక ప్రాంతమైన కొండవీడు కోటకు రక్షణగా కొత్తపాలెం వైపున రెడ్డిరాజుల కాలంలో ఏర్పాటుచేసిన ఎర్ర మట్టికట్ట ఆనవాళ్లు లేకుండా తవ్వకాలు చేసి భారీగా వెనకేసుకున్నారు. కోట గ్రామపరిధిలోని కందకం, కొండవీడు గ్రామపరిధిలోని చెరువు, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామసచివాలయం పరిధిలోని ప్రభుత్వ భూమి, యడ్లపాడు ఎర్రకొండ సమీపంలోని పోరంబోకు భూములు, జగ్గాపురం, జాలాది గ్రామాల పరిధిలోని నక్కవాగులో మట్టి తవ్వకాలతో వైసీపీ నాయకులు సొమ్ము చేసుకున్నారు.



చెరువులుగా మారిన ప్రభుత్వ భూములు



కొత్తపాలెం పరిధిలోని చారిత్రక కొండవీడుకోట రక్షణగా ఏర్పాటు చేసిన ఎర్ర మట్టికట్ట వద్ద ప్రత్తిపాటి సెల్ఫీ ఛాలెంజ్ (పాత చిత్రం)

చర్యలు.. విచారణ ఎప్పుడు?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటామని పలు వేదికలపై టీడీపీ నేతలు ప్రకటించారు. ఈ ఏడాది ఏప్రిల్ 7న పెదకూరపాడులో జరిగిన ప్రజాగళం బహిరంగసభలో సైతం అక్రమ మైనింగ్‌పై విచారణ చేయిస్తామన్నారు. తవ్వకాల లెక్కలు తేల్చి అక్రమాలకు పాల్పడిన వారి నుంచి ముక్కు పిండి వసూలు చేస్తామన్నారు. అలాగే ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్వయంగా మైదవోలు చెరువు, కొత్తపాలెం పరిధిలోని ఎర్ర మట్టికట్ట తవ్వకాలను స్వయంగా పరిశీలించి మంత్రి విడదల రజినిపై విమర్శలు చేశారు. అధికారంలోకి వచ్చాక తవ్వకాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఈ క్రమంలో మట్టి భోక్తల నుంచి నిజంగానే సొమ్ము కక్కిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

అర్హులైన రైతులందరికీ రుణాలు అందించాలి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్‌బాలాజీ



నరసరావుపేట. జూన్ 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ పంట రుణాలు అందజేయాలని కలెక్టర్ శ్రీకేష్ బాలాజీలత్కర్ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, వ్యవసాయ రుణ ప్రణాళికపై మంగళవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న త్రైమాసిక సమావేశానికి బ్యాంకుల వారీగా రుణ ప్రణాళికపై నివేదిక రూపొందించాలన్నారు. ఎంత మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలు మంజూరు చేశారు, ఎంతమంది రుణాలు తీసుకున్నారు, రుణాలు తీసుకున్నవారు ఎంత మంది సకాలంలో రుణాలు చెల్లిస్తున్నారన్న వివరాలపై ఆయా శాఖల అధికారులను ప్రశ్నించారు. బ్యాంకర్ల సమావేశానికి బ్యాంక్ కంట్రోలర్లు, జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. సమావేశానికి గైర్హాజరైన బ్యాంక్ అధికారుల నుంచి వివరణ తీసుకోవాలని ఎల్‌డీఎం రవిప్రసాద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ మీటింగ్ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి టీ మాధురి, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ అధికారి బాలూనాయక్, పరిశ్రమల శాఖ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, జిల్లా ఉద్యానశాఖాధికారి రామణారెడ్డి, పశు సంవర్థక శాక అధికారి కాంతారావు, ఆర్‌బీఐ ప్రతినిధి సునీల్, నాబార్డ్ అధికారి శరత్ తదితరులు పాల్గొన్నారు.

విలక్షణ కోర్సు ప్యాకేజింగ్ టెక్నాలజీ

ఒక వస్తువుని ఉత్పత్తి చేయడం ఎంత ముఖ్యమో, దానిని అంతే భద్రంగా వినియోగదారుడికి చేర్చడం కూడా ప్రధానమే. ఈ ప్రక్రియలో కూడా ఎంతో మంది పాల్గొంటారు. అందులో ప్యాకేజింగ్ ముఖ్యమైనది. వస్తువు స్వరూప స్వభావాలను అనుసరించి అవసరమైన విధంగా అట్టపెట్టె లేదంటే మరొకదానిలో పెట్టాలి. భద్రంగా దానిని వినియోగదారుడి ఇంటికి లేదంటే తను సందర్శించే షాపు వద్దకు చేర్చాలి. ఈ ప్రాసెస్ మొత్తం ప్యాకేజింగ్ కిందకు వస్తుంది. ఈ రంగంలో ప్రాథమిక కోర్సు 'డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ'. హైదరాబాద్ రామంతపూర్‌లో ఉన్న జెఎన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో ఈ కోర్సు ఉంది.



గ్రామాలు లేదంటే సమీప వ్యవసాయ క్షేత్రాల నుంచి పట్టణాలకు వెదురు బుట్టలు, తాటాకు తట్టల్లో కూరగాయలు, పండ్లు వస్తుంటాయి. జనుము సంచీల్లో బియ్యం రవాణా అవుతుంది. అయితే సాంకేతిక పురోభివృద్ధితో ప్యాకేజింగ్ అక్కడితో ఆగలేదు. ఒక హోటల్ నుంచి వండిన ఆహార పదార్థం, ఒక ఫార్మా కంపెనీ నుంచి పలు రకాల మందులు డిస్ట్రిబ్యూటర్‌కు చేరుకోవడం మొదలుకుని రకరకాల వస్తువులు ఆన్‌లైన్‌లో పొందే అవకాశం నేడుంది. ఆ క్రమంలో వస్తువు చెడిపోకుండా వినియోగదారుడికి చేర్చే ప్రక్రియకు సాంకేతికతను జోడించారు. దానిని పటిష్టంగా అమలు చేసేందుకు ప్యాకేజింగ్ ప్రధాన ఊతంగా మారింది. దేశీయంగా మధ్యతరగతి ఎదుగుదల, వ్యవస్థీకృత రీటైల్ రంగ విస్తరణ, ఎగుమతుల్లో పెరుగుదల ఫలితంగా ఈ కామర్స్ బలపడింది. అది సహజంగానే ప్యాకేజింగ్ పెరుగుదలకు దోహదపడింది. కొవిడ్ సంక్షోభం ఊహించని పెనుముప్పు. అయితే, ప్యాకేజింగ్ పరిశ్రమకు మాత్రం మంచి ఊపునిచ్చింది. ఒక పక్క ఔషధ పరిశ్రమ, మరోపక్క ఇంటికే నేరుగా డెలివరీలతో ప్యాకేజింగ్ పరిశ్రమ అవసరం బాగా పెరిగింది. ఆహారం నుంచి అవసరమైన వస్తువు వరకు ఏదైనా సరే, తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటికే తెప్పించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది.

కోర్సుగా: హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ఉన్న జెఎన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ మాత్రమే ఈ కోర్సును ఆఫర్ చేస్తోంది. ఈ కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. 1996లో దీన్ని ఇక్కడ ఆరంభించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ ఒక్క పాలిటెక్నిక్ మాత్రమే ప్యాకేజింగ్ టెక్నాలజీలో డిప్లొమాను అందిస్తోంది. గ్రామీణ, పేద విద్యార్థులకు ఈ కోర్సు నిజంగా వరమని చెప్పాలి. అత్యంత ప్రతిభావంతులైన ఫ్యాకల్టీ ఈ కోర్సును తీర్చిదిద్దడం నుంచి తమ విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్ కల్పించేందుకు తద్వారా వారు ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. కోర్సులో భాగంగా ప్యాకేజింగ్ మెటీరియల్ బేసిక్స్, మెథడాలజీ, డిజైన్, అప్లికేషన్ వంటి విషయాలన్నీ బోధిస్తారు. చివరి సెమిస్టర్‌లో సంబంధిత కంపెనీకి పంపి ప్రాక్టికల్‌గా అవగాహన కల్పిస్తారు.

ఉన్నత చదువులు

- ఈసెట్‌లో ర్యాంక్ సాధించి లేటరల్ ఎంట్రీ కింద బీటెక్‌లో చేరవచ్చు. మెకానికల్, ఏరోనాటికల్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ సీఎస్ఇ, ఐటీ బ్రాంచీల్లో చేరవచ్చు.
- హరియాణా రాష్ట్రం హిస్సార్‌లోని గురు జంబేశ్వర్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అలాగే హర్యానా సెంట్రల్ యూనివర్సిటీ ప్రింటింగ్ అండ్ ప్యాకేజింగ్ టెక్నాలజీలో బీటెక్ కోర్సును అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ సహకారంతో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ప్యాకేజింగ్‌లో ఎమ్మెస్సీ, ఐఐటీ రూర్కీ ప్యాకేజింగ్ టెక్నాలజీలో ఎంటెక్ అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ నేరుగా ప్యాకేజింగ్‌లో సర్టిఫికెట్, పీజీ డిప్లొమా ఆఫర్ చేస్తోంది.

ఉపాధి: ప్రొడక్ట్ డెలివరీ(అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు), ఫుడ్ డెలివరీ(స్విగ్గీ, జొమాటో వంటివి), ఫార్మా ఇండస్ట్రీ సహా ప్యాకేజింగ్ అవసరమైన ప్రతి సంస్థలో వీరికి ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఎలక్ట్రికల్ - ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల నుంచి వినియోగదారుడి చెంతకు చేరాల్సిన ప్రతి ప్రొడక్ట్‌కు ప్యాకేజింగ్ అవసరమే. అందుకే ఈ డిప్లొమా చేసిన వారికి నిరుద్యోగం అన్న ప్రసక్తే ఉండదు. నిజానికి డిమాండ్‌కు తగ్గ సరఫరాలేదు. ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్ కోసం ఈ ఏడాది 16 మందిని తీసుకున్న రెడ్డి ల్యాబ్స్ ఒకొక్కరికి స్టయిపెండ్‌గా రూ.15,000 చెల్లిస్తోందని ప్యాకేజింగ్ టెక్నాలజీ హెడ్ డాక్టర్ వై.వెంకటరెడ్డి తెలిపారు. తదుపరి మరో ఆరు నెలలు కూడా అదే స్టయిపెండ్‌కు పనిచేస్తే రెగ్యులర్ స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అంతేకాకుండా అరబిందో సహా పలు కంపెనీలు కూడా తమ విద్యార్థులను ఈ ఏడాది తీసుకున్నాయని తెలిపారు. చివరకు కోర్సు పూర్తి చేయలేని విద్యార్థులను సైతం కంపెనీలు తీసుకునే పరిస్థితి నెలకొందని ఆయన వివరించారు.

SCHOLARSHIP ALERT

Kotak Life Insurance Scholarship Program

Description: An initiative by Kotak Life Insurance Company Ltd. to provide financial assistance to students from Tamil Nadu and Maharashtra to help them pursue their undergraduate studies in the commerce stream.

Eligibility:

- ★ Open to students who are residents of Tamil Nadu and Maharashtra.
- ★ Applicants must be enrolled in the first year of a B.Com. program at any of the eight specified colleges in Tamil Nadu and Maharashtra. The list of colleges is given below:
  - ★ A. Veeriya Memorial Sri Pushpam College (Thanjavur, Tamil Nadu)
  - ★ Nadar Mahajana Sangam S. Vellaichamy Nadar College (Madurai, Tamil Nadu)
  - ★ Edayathangudy G.S. Pillay Arts and Science College (Nagapattinam, Tamil Nadu)
  - ★ Jai Hind Sindhu Education Trust's Manghanmal Udharam College of Commerce (Pune, Maharashtra)
  - ★ Gokhale Education Society's B.Y.K. (Sinnar) College of Commerce (Nashik, Maharashtra)
  - ★ LRD and SRP College for Women (Nagpur, Maharashtra)
  - ★ Vysya Arts and Science College (Salem, Tamil Nadu)
  - ★ Dharmapuram Adhinam Arts Col lege (Mayiladuthurai, Tamil Nadu)
- ★ Applicants must have scored 65% marks or more in Classes 10 and 12.
- ★ Applicants must have passed Class 12 in the year 2023-24.
- ★ The applicant's annual family inco me must be INR 3,60,000 or less.

Prizes & Rewards: Up to INR 30,000 per year

Last Date: 31-07-2024 *Application mode:* Online only

Short Url: www.b4s.in/aj/KLISP2

HOPE Engineering Scholarship by Schaeffler India

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000 *Last Date:* 30-07-2024

Application mode: Online only *Short Url:* www.b4s.in/aj/SIHE15

దిక్సూచి DIKSUCHI

Tata Capital Pankh Scholarship Program

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.

Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.

Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less) *Last Date:* 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TCPS27

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/FsGGu7Qలో చదవండి.

జేఎన్‌టీయూకేలో ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్(ఐసీపీ)లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్)తో కలసి ఆరేళ్ల ప్రోగ్రామ్‌ను, యూఎస్ఏలోని యూనివర్సిటీ ఆఫ్ నార్తరన్ అయోవా(యూఎన్ఐ)తో కలసి నాలుగేళ్ల ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.



జేఎన్‌టీయూకే-బీటీహెచ్ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్‌లో సీఎస్ఈ, సీఎస్ఈ(ఏఐ&ఎంఎల్), ఈసీఈ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు చొప్పున మొత్తం 60 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం సీట్లను ఐఐటీ జేఈఈ మెయిన్ అభ్యర్థులకు మిగిలిన సగం సీట్లను టీజీ/ఏపీ ఈఏపీసెట్ అభ్యర్థులకు నిర్దేశించారు.

- ప్రోగ్రామ్ మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్‌టీయూలో, చివరి మూడేళ్లు బీటీహెచ్-స్వీడన్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది కోర్సును బీటీహెచ్‌లో పూర్తిచేశాక ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి కాకినాడ జేఎన్‌టీయూ బీటెక్ డిగ్రీని, బీటీహెచ్ బీఎస్ డిగ్రీని ప్రదానం చేస్తాయి. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ మొత్తం పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది.

ఎంఎస్ స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్-సిస్టమ్స్.

జేఎన్‌టీయూకే-యూఎన్ఐ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్‌లో ఈఈఈ స్పెషలైజేషన్ ఉంది. మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్‌టీయూలో, చివరి ఏడాది యూఎన్ఐ-యూఎస్ఏలో చదవాలి. వీరికి జేఎన్‌టీయూకే నుంచి బీటెక్ డిగ్రీ, యూఎన్ఐ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు యూఎన్ఐలో కోర్సును కొనసాగిస్తూ మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో చేరే వీలుంది.

అర్హత వివరాలు: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులందరికీ జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత తప్పనిసరి.


- బీటీహెచ్ నిబంధనల ప్రకారం ఇంటర్ ఆంగ్ల మాధ్యమంలో చదవని వారు టోఫెల్/ఐఈఎల్‌టీఎస్ అర్హత పొందాల్సి ఉంటుంది. టోఫెల్‌లో 575/90 స్కోర్; ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5 స్కోర్‌తోపాటు మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్ రావాలి.
- యూఎన్ఐ నిబంధనల ప్రకారం ఐఈఎల్‌టీఎస్‌లో 6.0 లేదా టోఫెల్‌లో 79 స్కోర్ ఉండాలి. మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే బీఎస్ డిగ్రీలో కనీసం 3.0 క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ ఉండాలి. మూడు రికమండేషన్ లెటర్లు, పర్సనల్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూకే, కాకినాడ - 533003
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in



నవ్య చిత్రజ్యోతి

అధర్మాన్ని అణిచేయగా...



భారీ అంచనాల మధ్య 'కల్కి 2898 ఏడీ' చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రమోషనల్ కంటెంట్‌తో చిత్ర బృందం ఎప్పటికప్పుడు ఆ అంచనాలను రెట్టింపు చేస్తోంది. తాజాగా 'థీమ్ ఆఫ్ కల్కి' లిరికల్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. 'అధర్మాన్ని అణిచేయగా' అంటూ చంద్రబోస్ రాసిన ఈ పాటను కాలభైరవ పాడారు. సంతోష్ నారాయణ్ స్వరాలు సమకూర్చారు. పాత్రల తాలుకు నేపథ్యం, వాటి సంఘర్షణ.. ఇవన్నీ పాటలో చూపించారు. ఇటీవల ఈ పాటను మధురలో ఆవిష్కరించారు. ప్రముఖ నటి, నర్తకి శోభనా చంద్రకుమార్ ఈ పాట కోసం గజ్జె కట్టారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపిక, దిశా పటాని కీలక పాత్రలు పోషించారు.

ఎలా ఉన్నావ్ శ్రీలీల

● బుగ్గ గిల్లి.. ఆప్యాయంగా పలకరించిన సంగీత దర్శకుడు తమన్



శ్రీవారి దర్శనార్థం వచ్చిన హీరోయిన్ శ్రీలీలను చూసిన సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ ఆప్యాయంగా పలకరించారు. శ్రీలీల మంగళవారం స్వామిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వస్తున్న క్రమంలో దర్శనానికి వెళుతున్న తమన్ మహాద్వారం వద్ద ఎదురుపడ్డారు. దీంతో తమన్ ఆగి శ్రీలీలను బుగ్గ గిల్లి.. ఎలా ఉన్నావ్ అంటూ పలకరించారు. అనంతరం శ్రీలీల తన కుటుంబ సభ్యులను తమన్‌కు పరిచయం చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

నేతాజీ మార్గంలో నేను



'ఇది రెండో స్వతంత్ర పోరాటం... గాంధీజీ మార్గంలో మీరు, నేతాజీ మార్గంలో నేను' అంటున్నారు కమల్‌హాసన్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2') చిత్రంలోనిదీ డైలాగ్. మంగళవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. దేశంలో అవినీతిపరులను ఏరి పారేసేందుకు ఈ సారి సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ ఎలాంటి సాహసాలు చేయబోతున్నాడో అనే ఆసక్తిని కలిగించేలా ట్రైలర్‌ను రూపొందించారు. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, సిద్ధార్థ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి శంకర్ దర్శకుడు. 1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి ఇది కొనసాగింపు. జూలై 12న 'భారతీయుడు 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బ్యానర్స్‌పై సుభాస్కరన్ నిర్మించారు.



పవన్‌తో అల్లు అరవింద్ భేటీ

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ఏపీలో సినీ నిర్మాణ రంగం, ప్రదర్శన రంగం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గురించి ఈ సమావేశంలో వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది.

శ్రీనివాసుని సన్నిధిలో సుశీల



సీనియర్ నేపథ్య గాయని పి. సుశీల మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమె శ్రీవారికి తలనీలాలు సమర్పించి మంగళవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు సుశీలను చూసిన పలువురు అభిమానులు దగ్గరకు వెళ్లి పలకరించారు. కొందరు ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు. ఎన్నాళ్ల నుంచో స్వామి వారికి తలనీలాలు సమర్పించే మొక్కు ఉందనీ, ఇన్నాళ్లకు అది తీరిందని సుశీల చెప్పారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/adGg9cX లో చదవండి.

పిన్నెల్లీ.. రాజకీయ సన్యాసం ఎప్పుడు..?

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి


ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

మాచర్లటౌన్, జూన్ 25: మాట తప్పడం.. మడమ తిప్పడం పిన్నెల్లి వంశంలో లేదని, అన్న మాటకు కట్టుబడి ఉంటారని నా నమ్మకం.. ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎప్పుడు సన్యాసం తీసుకుంటారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 2024 ఎన్నికల ప్రచార సమయంలో అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తనను ఓడించే స్థాయి జూలకంటి బ్రహ్మానందరెడ్డికి లేదని, ఒకవేళ తనను ఓడిస్తే రాజకీయాలకు దూరంగా ఉంటానంటూ అవసరమైతే శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని పలుమార్లు ప్రగల్భాలు పలికిన రామకృష్ణారెడ్డి మాటమీద నిలబడతాడా..! అని ఎమ్మెల్యే జూలకంటి ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో వరుసగా నాలుగుసార్లు ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి గెలిచాక రాబందుల్లా పట్టి పీడించారన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించడం, అక్రమ మద్యం, ఇసుక, పాన్‌పరాగ్, గుట్కా, అక్రమ మైనింగ్, గ్రానైట్ తరలింపుతో కోట్లు గడించారన్నారు. ప్రశ్నిస్తే ప్రతిపక్షాలపై కేసులు పెట్టి ఇబ్బందుల పాలు చేశారని, ఆధిపత్యం కోసం గ్రామాల్లో హత్యలకు పురిగొల్పారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు వాస్తవాలు గుర్తించి ఓటుతో ఇంటికి పంపించారని పేర్కొన్నారు. షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించిన ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పారిపోయి ఎక్కడ తలదాచుకున్నాడో అని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో తమ రౌడీగ్యాంగ్‌ను అడ్డుపెట్టుకొని ప్రశ్నించే గొంతును అణచివేసి దౌర్జన్యాలు, దోపిడీలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి నేడు కనిపించకుండా పారిపోయాడన్నారు. త్వరలోనే పిన్నెల్లి సాగించిన అక్రమ దందాలు, సంపాదన, అరాచకాలపై దర్యాప్తు జరిపించి సరైన గుణపాఠం చెప్తామని ఎమ్మెల్యే అన్నారు. విజనరీ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబునాయుడు అని, ప్రభుత్వానికి అండగా ఉన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ సహకారంతో మాచర్ల నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు.

28న జాబ్‌మేళా

గుంటూరు(విద్య), జూన్ 25: ఈనెల 28న గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కే రఘు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసి 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఉదయం 9.30గంటలకు బయోడేటా, ఇతర అర్హతపత్రాలతో రావాలని సూచించారు. వివరాలకోసం 63648 67800, 63648 67801లో సంప్రదించాలన్నారు.

పోస్టింగ్‌ల కోసం పైరవీలు

● ఎమ్మెల్యేలు, నేతల చుట్టూ ప్రదక్షిణలు
● హామీ రాకపోవడంతో రూటు మార్చిన ఖాకీలు
● ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన నేతలతో బేరసారాలు

గుంటూరు, జూన్ 25: ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అనుకున్న పోస్టింగ్ సాధించడంలో ఆరితేరిన ఓ పోలీసు ముఠా యథావిధిగా ఈసారి కూడా రంగంలోకి దిగింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో, ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో ఈ ముఠా 'సూట్ కేస్ కొట్టు పోస్టింగ్ పట్టు' అనే నినాదంతో విజయవంతంగా పోస్టింగ్స్ సాధించింది. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కొందరు అధికారులను టార్గెట్ చేసి వెంటాడి వేటాడింది. వీఆర్ పేరుతో కనీసం జీతం కూడా రానిచోటకు మరికొందరిని తరిమేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఐదేళ్లలో ప్రభుత్వ వేధింపులకు గురైన అధికారులకు న్యాయం జరుగుతుందని అందరూ భావిస్తున్నారు. అయితే వారికి పోస్టింగ్స్ వస్తాయో లేదో అనే అనుమానాలు కలిగేలా పైరవీ ముఠా రంగంలోకి దిగింది. ఈ ముఠా నేరుగా టీడీపీ సీనియర్ నేతలను కలిసే సాహసం చేయలేక ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి ఇతర పార్టీల నుంచి టీడీపీలో చేరిన నాయకులను సూట్ కేసులతో కలిసి ప్రసన్నం చేసుకునే పనిలో పడిందనే విమర్శలున్నాయి. సీనియర్ నాయకులు, గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారికి నియోజకవర్గంపై పట్టు ఉంది. దీంతో అక్కడ పోస్టింగ్స్ విషయంలో ఎవరెవరిని నియమించుకోవాలనే దానిపై వారికి స్పష్టమైన అవగాహన ఉంది. దీంతో పైరవీ ముఠా ఆ సీనియర్ ఎమ్మెల్యేల వద్దకు వెళ్లే సాహసం చేయలేదు. పార్టీలోకి కొత్తగా వచ్చినవారికి ఇక్కడి పరిస్థితుల మీద అవగాహన లేకపోవడంతో, ఈ పైరవీ ముఠా ఆయా ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించింది. అయితే వారినుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఎన్నికలకు ముందు వైసీపీతో పాటు ఇతర పార్టీల నుంచి టీడీపీలో చేరిన నాయకులను, ఇతర కూటమి నేతలను కలసి బేరసారాలు సాగిస్తున్నట్లు పోలీస్‌శాఖలో చర్చ జరుగుతోంది. ఆయా నేతలు ఇప్పటికే వారికి హామీ కూడా ఇచ్చినట్లు సమాచారం. గడిచిన 10 ఏళ్లలో ఈ ముఠాలోని అనేకమంది పోలీస్ అధికారులు గుంటూరుతో పాటు జిల్లాలో కీలకమైన పోలీస్‌స్టేషన్లలో ఏళ్ల తరబడి విధులు నిర్వహించారు. ఈసారి కూడా అదే తరహాలో పోస్టింగ్ సాధించేందుకు ఈ ముఠా ప్రయత్నాలు ప్రారంభించిందని సమాచారం. అయితే పోలీస్ పోస్టింగ్స్ విషయంలో గతంలో పరిస్థితులే పునరావృతమైతే ఈసారి సహించేది లేదని కూటమి బహిరంగంగానే హెచ్చరిస్తోంది. పోలీసుల పోస్టింగ్స్ విషయంలో కొత్తగా ఎన్నికైన ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు పార్టీ విధి విధానాలకు విరుద్ధంగా మెతకవైఖరి అవలంబిస్తున్నారనే వాదన కూడా ఉంది. ఈ నేపథ్యంలో పోలీస్ పోస్టింగ్ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఇప్పటికే అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

బాధితులకు గుర్తింపు..

గతంలో ఇబ్బందులు పడినవారు అన్యాయానికి గురైన వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించినట్లు సమాచారం. గడిచిన ఐదేళ్లలో ఇబ్బందులు ఎదుర్కొన్న అధికారుల జాబితాను కూడా తయారు చేసేందుకు కసరత్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ దఫా ఎస్సై నుంచి డీఎస్పీ, సీఐ పోస్టింగ్స్ వరకు అధిష్ఠానం స్థాయిలో కసరత్తు జరిగిన తర్వాతే నిర్ణయాలు ఉంటాయని పోలీస్ అధికారులతో పాటు పార్టీ ముఖ్య నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఐదేళ్లలో ఇబ్బందులు ఎదుర్కొన్న అధికారులతో పాటు అధికార పార్టీ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ నిబంధనల ప్రకారమే పనిచేసిన వారికి కూడా తగిన అవకాశాలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ శాఖ అధికారి తిప్పలు

పోలీస్ శాఖలో పరిస్థితి ఇలా ఉంటే విద్యుత్ శాఖలో పరిస్థితి మరోలా ఉంది. గడిచిన ఐదేళ్ల అధికార పార్టీ నేతలతో అంట కాగి అతిగా వ్యవహరించిన ఓ అధికారి తిరిగి పోస్టింగ్ కోసం పల్నాడు ప్రాంతానికి చెందిన ఓ ప్రజాప్రతినిధిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకులు కేబుల్ వ్యాపారంలోకి దిగి కేబుల్ రంగంలో పాతుకుపోయిన ఓ సంస్థను ఢీ కొట్టిన విషయం విదితమే. ఆ సమయంలో ఈ అధికారి వైసీపీ నేతలు చెప్పిందే వేదంగా భావించి కేబుల్ వైర్లు కత్తిరించడంలోనూ, విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు ఉండరాదని, లేదంటే ఒక్కో స్తంభానికి రూ.50 చెల్లించాలని బెదిరించారు. అంతేగాక ఆపరేటర్లు, కేబుల్ బాయ్‌లపై పోలీస్‌స్టేషన్లలో కేసులు పెట్టి అరెస్టులు చేయించడంలోనూ ఈయన కీలకంగా వ్యవహరించినట్లు కేబుల్ ఆపరేటర్లు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం మూడేళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలి. అయితే ఆ అధికారికి గతంలో వేరే పార్టీలో ఉన్న నాయకులతో తనకున్న సంబంధాలతో ఆయన అక్కడి ప్రజాప్రతినిధిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈయన గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంక్రాంతి సంబరాలకు ఏకంగా రశీదు పుస్తకాలు ముద్రించి పెద్ద ఎత్తున బలవంతంగా వసూళ్లకు పాల్పడి, కొంత పల్నాడు ప్రాంతానికి చెందిన వైసీపీ ప్రజా ప్రతినిధికి ముట్ట చెప్పాడనే విమర్శలున్నాయి. టీడీపీ నాయకుడిని అక్రమంగా సీఐడీ కేసులో గత ప్రభుత్వం అరెస్ట్ చేసిన సందర్భంలో ఆయనను పరామర్శించేందుకు నేరుగా పార్టీ అధినేత చంద్రబాబు రాగా ఆ సమయంలో ఉద్దేశపూర్వకంగానే విద్యుత్ సరఫరా నిలిపించినట్లు కూడా ఆరోపణలు ఎదుర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీవీసీ హాస్పటల్స్ చైర్మన్, ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

వెయ్యి ఆర్థోపెడిక్ సర్జరీల మైలురాయి సాధించిన డీవీసీ హాస్పటల్

● చైర్మన్ నరేంద్రకుమార్ ● డాక్టర్ జి.జగదీష్‌కు అభినందనలు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జూన్ 25: ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టర్ గుడారు జగదీష్ ఆధ్వర్యంలో డీవీసీ హాస్పటల్ వెయ్యి ఆర్థోపెడిక్ సర్జరీలు అచిరకాలంలోనే పూర్తిచేశామని హాస్పటల్ చైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. వడ్లమూడి డీవీసీ హాస్పటల్‌లో మంగళవారం ఆర్థోపెడిక్ విభాగం వెయ్యి సర్జరీలు పూర్తి చేసుకున్న సందర్భంగా డాక్టర్ గుడార్ జగదీష్‌ను అభినందించారు. చైర్మన్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో బర్డ్ హాస్పటల్ మాజీ డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ 2019లో డీవీసీ హాస్పటల్‌లో సేవలు ప్రారంభించారన్నారు. ఐదేళ్ల కాలంలోనే వెయ్యి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఆర్థోపెడిక్ రంగంలో డాక్టర్ జగదీష్ అసాధారణ నైపుణ్యం, అంకితభావం, రోగుల సంరక్షణలో అకుంఠిత దీక్షతో ఉన్నారని కొనియాడారు. అత్యుత్తమ వైద్య సదుపాయాలను, అధునిక పద్ధతులను అవసరాలకు అనుగుణంగా హాస్పటల్ నిర్వహణ ద్వారా తాము సమకూరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగండ్ల శ్రీనివాస్, సీవోవో డాక్టర్ నవీన్ కరణం తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్ జేసీకి జాతీయస్థాయి ఏఏ రేటింగ్


సర్టిఫికెట్లను కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణకు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

గుంటూరు (విద్య), జూన్ 25: ఎన్‌టీపీఈఎల్ మద్రాసు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్స్‌లలో ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు జాతీయ స్థాయిలో 11వ సారి ఏఏ రేటింగ్ వచ్చినట్లు కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐఐటీ-మద్రాస్ నిర్వహించిన ఎన్‌పీటీఈఎల్ పరీక్షకు అత్యధిక మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌లను ఇటీవల ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు అందుకున్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉన్న 6,335 చాప్టర్స్‌లో తమ కళాశాల లోకల్ చాప్టర్ జాతీయస్థాయిలో అత్యుత్తమ స్థానంలో ఉన్నట్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్లను కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ఎన్‌పీటీఈఎల్ లోకల్ చాప్టర్ సమన్వయకర్త, సీఎస్‌బీఎస్ విభాగాధిపతి డాక్టర్ ఎంపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

29న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి..

● జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



గుంటూరు, జూన్ 25: ఈ నెల 29న గుంటూరు జిల్లా అంతటా అన్ని కోర్టులలో జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు త్వరితగతిన కేసులు పరిష్కారం కొరకు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి కోరారు. జిల్లా అంతటా ఉన్న కోర్టులలో ఈ నెల 29న జరగబోయే జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం గురించి కక్షిదారులకు అవగాహన కల్పిస్తూ ఇరుపక్షాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వీలైనంత వరకు ఎక్కువగా కేసులను డిస్పోజల్ చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో జరగనున్న ఈ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులలో ఇరుపక్షాల సమ్మతితో ఆయా కేసులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇతర కేసులను కూడా వీలైనంతవరకు ఎక్కువగా డిస్పోజల్ చేయాలని పోలీస్ అధికారులకు తెలిపారు. కోర్టు నందు కేసులు పెండింగ్‌లో ఉన్న కక్షిదారులు వారి కేసులను లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకొనేందుకు ముందుకు రావాలని సూచించారు. కేసులు రాజీ ద్వారా పరిష్కరించుకుంటే కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగే శ్రమ, సమయం తగ్గుతుందని, డబ్బు ఆదా అవుతుందని, సత్వరం పరిష్కారం లభిస్తుందని, ఇరుపక్షాల మధ్య స్నేహపూరిత సంబంధాలు ఉంటాయని పేర్కొన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పెదకాకాని, జూన్ 25: కాకాని రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందినట్లు మంగళవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. గుంటూరు ఆనంద్‌పేటకు చెందిన సయ్యద్ సుభాని(45) తన అన్న సయ్యద్‌దావూద్‌కు చెందిన ఆటోనగర్‌లోని పాతసామాన్లు కొనుగోలు దుకాణంలో పని చేస్తుంటాడు. గత రాత్రి కాకాని రోడ్డులో బస్టాండ్ వైపు నడుచుకుంటూ వస్తుండగా ఆటోనగర్ కాంప్లెక్స్ సెంటర్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలు సుభాని అక్కడికక్కడే మృతిచెందారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

ఏఎన్‌యూలో పీసెట్ దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం


రన్నింగ్ పోటీలో తలపడుతున్న అభ్యర్థులు


కబడ్డీలో తలపడుతున్న అభ్యర్థులు

పెదకాకాని, జూన్ 25: ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ దేహదారుఢ్య పరీక్షలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రారంభమయ్యా యి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షలను మంగళవారం నుండి ప్రారంభించినట్లు పీసెట్ -2024 కన్వీనర్ ప్రొఫెసర్ పి.జాన్సన్ తెలిపారు. చివరి రోజు 27వ తేదీన మహిళా అభ్యర్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. దేహదారుఢ్య పరీక్ష లలో 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, 800 మీటర్ల పరుగుతో పాటు అభ్యర్థి ఎంపిక చేసుకున్న ఒక ఆటలో ప్రావీణ్యం పరీక్షిస్తారు. వీటితోపాటు అభ్యర్థులు తాము సాధించిన జాతీయ, అంతర్జాతీయ పోటీలలో క్రీడా ప్రతిభకుగాను ప్రోత్సాహక మార్కులు కేటాయించ నున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు 580మంది అభ్యర్థులకుగాను 379మంది అభ్యర్థులు హాజర య్యారు. ఈ పరీక్ష నిర్వహణ కొరకు రాష్ట్రం నుండి వివిధ విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల వ్యాయామ అధ్యాపకులు, స్టేట్ కమిటీ సభ్యులను పర్యవేక్షకులుగా వ్యవహరించారు.

ఎంపీగా పెమ్మసాని ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు పార్లమెంటుసభ్యుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సోమవారం పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేశారు. 'పెమ్మసాని చంద్రశేఖర్ అను నేను.. లోక్‌సభ సభ్యుడిగా ఎన్నుకొనబడిన వాడనై శాసనము ద్వారా..' అంటూ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పార్లమెంట్ వేదికగా తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెమ్మసాని చంద్రశేఖర్ పార్లమెంట్ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సభలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, భర్తృహరి మెహతాబ్‌కు అభివాదం చేసారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ తనకు ఎంపీగా అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, 3 లక్షల భారీ మెజారిటీతో గెలిపించిన గుంటూరు పార్లమెంట్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయాల ధ్రువపత్రాలపై రాజముద్ర

పిడుగురాళ్ల, జూన్ 25: వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని కార్యాలయాల్లో జారీచేసే ధ్రువపత్రాలపై నాటి ముఖ్యమంత్రి చిత్రపటం కనుమరుగైంది. ఈ ఎన్నికలలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో సచివాలయాల్లో జారీచేసే పలురకాల ధ్రువపత్రాలపై జగన్ బొమ్మను తొలగించి రాజముద్ర వున్న హైసెక్యూరిటీ ఫామ్స్ సచివాలయాలకు అందాయి. గత వైసీపీ పాలనలో జగన్ బొమ్మ వున్న హైసెక్యూరిటీ పత్రాలన్నీ నిలిపివేసి వాటి స్థానంలో రాజముద్రతో వున్న హైసెక్యూరిటీ ఫామ్స్‌ను ప్రభుత్వం సచివాలయాలకు అందజేసింది.


సచివాలయాల్లో గతంలో జారీచేసిన ధ్రువపత్రాలపై జగన్ చిత్రం


కొత్తగా జారీచేసే ధ్రువపత్రంపై జగన్ చిత్రం స్థానంలో వున్న రాజముద్ర


పడవలకు, బల్లకట్టులకు వేలం

అచ్చంపేట, జూన్ 25: గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ఆధీనంలోని రేవులైన చామర్రు, చింతపల్లి, గింజుపల్లి, తాడువాయి, మాదిపాడులలోని పడవలు, బల్ల కట్టులకు ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో షీల్డ్ టెండర్ల ద్వారా వేలం నిర్వహిస్తున్నట్లు అచ్చంపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుసుమకుమారి తెలిపారు. 2024 - 2025 సంవత్సరానికి జూలై 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు ఈ పాటలు అమల్లో ఉంటాయ న్నారు. గుంటూరులో జరిగే షీల్డ్ టెంటర్లు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి బహిరంగ వేలం నిర్వహిస్తారని తెలిపారు.

నేడు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ

గుంటూరు, జూన్ 25(ఆంధ్రజ్యోతి): నిత్యం విశాఖపట్ట ణం-లింగంపల్లి-విశాఖపట్టణం మధ్యన ప్రయాణించే జన్మ భూమి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 26వ తేదీ బుధవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ తెలిపారు. నెం.12805 విశాఖపట్టణం- లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ మంగళవారమే పునరుద్ధరణ జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వలన బుధవారానికి వాయిదా పడిందన్నారు. అలానే నెం.12806 లింగంపల్లి- విశాఖపట్ట ణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈనెల 26కి బదులు 27న పునరుద్ధరిస్తున్నామన్నారు. ఈ విషయా న్ని ప్రయాణీకులు గమనించి రైల్వేశాఖకి సహక రించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యాసంస్థల బస్సులపై 18 కేసులు


విద్యాసంస్థల బస్సుల తనిఖీలు నిర్వహిస్తున్న రవాణా శాఖ అధికారులు

గుంటూరు(తూర్పు), జూన్ 25: నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. తనిఖీల్లో భాగంగా పర్మిట్ కండిషన్ ఉల్లంఘించిన బస్సులపై 18 కేసులు నమోదు చేశారు. ఇందులో ఫిట్నెస్ లేకుండా తిరుగుతున్న అగ్నిమాపక పరికరం లేని బస్సులపై 3, యూనిఫామ్ లేని డ్రైవర్లపై 11, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించినందుకు 2, నిబంధనలు పాటించని బస్సులపై 2, మొత్తం 18 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీటీసీ కరీం మాట్లాడుతూ బస్సులపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

వివిధ కేసుల్లో నిందితులకు జైలు

నరసరావుపేట లీగల్, జూన్ 25: వివిధ కేసుల్లో నేరం రుజువవ్వటంతో నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవలిక మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ ఏడాది మార్చి 3న మండలంలోని రావిపాడుకు చెందిన పతకమూరి అంజనాదేవి వ్యక్తి గత పనుల నిమిత్తం తొండపి గ్రామానికి వెళ్తూ రూపెనగుంట్ల అడ్డరోడ్డు వద్ద ఆటోలో దిగింది. తన బాబాయి కోసం ఆమె వేచి చూస్తుండగా ముఖానికి మాస్క్ పెట్టుకున్న ఓ వ్యక్తి మాటలు కలిపి తాను అటే వెళ్తున్నానని, మోటారు సైకిల్ ఎక్కించుకొని మార్గమధ్యంలో ఆమె మెడలోని 39 గ్రాముల బంగారు నగలను తెంచుకొని వెళ్ళాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న నకరికల్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడైన పట్టణంలోని రామిరెడ్డిపేటకు చెందిన షేక్ నాగూర్ బాషా, ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన ఆరె మురళీమోహన్‌రెడ్డిలను అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువవ్వటంతో నాగూర్‌బాషాకు ఏడాది జైలు, వెయ్యి రూపాయల జరిమానా, మురళీమోహన్‌రెడ్డికి మూడు నెలల జైలు, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ ఎస్ విజయకుమార్ నిర్వహించారు. కాగా ఇదే నిందితులపై నరసరావుపేట రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన మరో కేసు కూడా రుజువవ్వటంతో ఒక్కొక్కరికి మూడు నెలలు జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. మండలంలోని గురవాయపాలెం గ్రామానికి చెందిన సుందర పారిజాతం గత ఏడాది డిసెంబరు 8న వ్యక్తిగత పనుల నిమిత్తం పట్టణానికి వచ్చింది. మార్కెట్ సెంటర్‌లో సరుకులు కొనుగోలు చేయటానికి వెళ్ళగా నిందితులు ఆమె మెడలోని 16 గ్రాముల బంగారు నగలను లాక్కు వెళ్ళారు. ఈ మేరకు నేరం రుజువవ్వటంతో పైవిధంగా కోర్టు తీర్పు వెలువడింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ లక్ష్మీరావు నాయక్ నిర్వహించారు.

51,353 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,183 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 51,353 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 19,393 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	9000	17000	334	11000	16500
నెంబరు. 5	9000	15500	నెంబరు.5	13000	15500
273	9500	14000	273	15500	16000
341	8500	16500	341	8500	17500
4884	17000	17000	4884	9000	9000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19700	తేజ	9000	20000
బ్యాడిగి	9000	17500	బ్యాడిగి	9500	16000
దేవనూరు డీలక్స్	9500	16000	దేవనూరుడీలక్స్	9500	12000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	12000

పార్లమెంటరీ నేతగా ఎంపీ లావు.. హర్షణీయం

● టీడీపీ మండల అధ్యక్షుడు వీరాస్వామి


వీరాస్వామి

మాచర్ల రూరల్, జూన్ 25: నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలును పార్లమెంటరీ నేతగా నియమించడంపై టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని విజయపురిసౌత్‌లో ఆయన మాట్లాడుతూ ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాచర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, పింఛన్ నగదు పెంపు, అన్న క్యాంటీన్, నైపుణ్య గణనపై సంతకాలు చేసి మాట నిలబెట్టుకున్నారని వీరాస్వామి అన్నారు.

సత్రశాల ఆలయానికి దేవతా విగ్రహాలు


టీటీడీ అందజేసిన దేవతా మూర్తుల విగ్రహాలు

రెంటచింతల, జూన్ 25: పల్నాట ప్రముఖ శైవక్షేత్రం కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని శ్రీగంగా భ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి వార్ల ఆలయానికి టీటీడీ బోర్డు రెండో విడతగా సిద్ధిబుద్ధి గణపతి, అన్నపూర్ణేశ్వరీ, శ్రీవల్లిదేవసేన సుబ్రహ్మణ్య స్వామి వారితో పాటు మరో నాలు గు విగ్రహాలను అందజేసినట్లు సత్రశాల ట్రస్ట్ బోర్డు చైర్మన్ బి.బ్రహ్మారెడ్డి చెప్పారు. ఈ విగ్రహాల మంజూరు నిమిత్తం తమ వంతు వాటాగా రూ.1.93 లక్షలు చెల్లించామన్నారు. గతంలో శివపార్వతులు, రామలక్ష్మణుడు, వీరభద్రుని పంచలోహ విగ్రహాలను అందజేశారన్నారు. నవంబరులో స్పటిక స్పర్శ శివలింగాన్ని జైపూర్ నుంచి తెచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు.

తాగునీటి వనరులపై దృష్టి సారించాలి : ఎంపీడీవో

రెంటచింతల, జూన్ 25: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి వనరులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శంకరరావు ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 11 గ్రామాల కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాటర్ ట్యాంకుల్లో నీళ్లు నింపే సమయంలో ప్రతి రోజు క్లోరినేషన్ చేయాలని, పైప్ లైన్ లీకేజ్‌లు అరికట్టాలని, బ్లీచింగ్ చల్లాలని, మురికి నీటి కాలువల్లో వేసిన మంచి నీటి పైపులను వెంటనే తొలగించాలన్నారు. అపరిశుభ్రత అనేది ఉండడానికి వీల్లేదన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేంద్రారెడ్డి, కార్యదర్శులు కోటేశ్వరరావు, సుబ్బారావు, వెంకయ్య శౌరీ కుమారి, బాలునాయక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఏ పోస్టులకు 10 దరఖాస్తులు..

రెంటచింతల, జూన్ 25: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి వివిధ గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేయడానికి 11 గ్రామాలకు గాను 10 గ్రామాల నుంచి 10 దరఖాస్తులొచ్చాయని ఎంపీడీవో శంకరరావు చెప్పారు. ఈ దరఖాస్తులన్నింటిని ఫైనల్ చేసే నిమిత్తం పీడీ జోసఫ్‌కుమార్‌కు పంపామన్నారు. మల్లవరం నుంచి ఎటువంటి దరఖాస్తులు రాలేదన్నారు.

పట్లవీడులో చోరీ.. ఆలస్యంగా వెలుగులోకి..


గృహంలో చెల్లాచెదురుగా పడి ఉన్న దుస్తులు

వెల్దుర్తి, జూన్ 25: మండలంలోని పట్లవీడులో చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన తాటికొండ పుల్లారెడ్డి వారం రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. సోమవారం గ్రామానికి చేరుకొని ఇంటి తలుపులు తీయగా బెడ్‌రూమ్‌లోని బీరువా పగులకొట్టడంతోపాటు దుస్తులు, వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడాన్ని చూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. మంగళవారం క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరిం చి వెళ్లారు. బీరువాలోని నక్లెస్‌తోపాటు వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు పుల్లారెడ్డి తెలిపారు. సుమారు రూ.5 లక్షల విలువ ఉంటాయని వాపోయాడు.

అమరేశ్వరుడిని దర్శించిన మంత్రి సుభాష్

అమరావతి, జూన్ 25: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ మంగళవారం ఉదయం సందర్శించారు. మంత్రి సుభాష్‌కు ఆలయ మర్యాదలతో అర్చకులు, ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. అర్చకులు మంత్రి పేరుమీద స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి రూరల్, జూన్ 25 : మండలంలోని రామకృష్ణాపురం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో మిగిలిపోయిన ఖాళీల భర్తీలకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం జాన్సన్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 - 25 విద్యాసంవత్సరానికి గాను ఆరు నుంచి 9వ తరగతి వరకు మిగిలిన ఉన్న ఖాళీ సీట్లకు ఈనెల 28వ తారీఖు నందు ప్రవేశ పరీక్ష జరపునున్నట్టు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

29న జాతీయ లోక్ అదాలత్

సత్తెనపల్లి, జూన్ 25: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు వారి ఆదేశాల మేరకు ఈనెల 29వ తేదీ శనివారం మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో ఉన్న కోర్టుల యందు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. లోక్ అదాలత్‌లో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంక్ కేసులు పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. కోర్టుల పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

29న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మాచవరం, జూన్ 25: ఈ నెల 29వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో సురేష్ మంగళవారం తెలిపారు. ఎంపీపీ దారం అమ్ములమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, పలు ప్రభుత్వశాఖల అధికారులు తగు సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

టీడీపీ సీనియర్ నేత కొరిమెళ్ల మృతి

దాచేపల్లి, జూన్ 25: దాచేపల్లి మండలం నడికూడి టీడీపీ సీనియర్ నాయకులు కొరిమెళ్ల మోహన్‌రావు సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మోహన్‌రావు కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. దాచేపల్లి మండల నాయకులు మోహన్‌రావు మృతదేహానికి నివాళులర్పించారు.

ఆర్భాటంగా నగర పంచాయతీల ఏర్పాటు

● నాలుగేళ్లయినా భర్తీ చేయని ఉద్యోగుల పోస్టులు

● డిప్యుటేషన్‌పై అసంపూర్తి పరిపాలన



గురజాల నగర పంచాయతీ కార్యాలయం

పిడుగురాళ్ల, జూన్ 25: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా మేజర్ పంచాయతీలను నగర పంచాయతీలుగా చేశామని గొప్పగా ఆర్భాటపు ప్రకటనలు, ప్రసంగాలు చేసిన వైసీపీ నేతలు, ఎమ్మెల్యేలు కొత్తగా ఏర్పాటైన నగర పంచాయతీలలో ఉద్యోగుల భర్తీ విషయాన్ని గాలికొదిలేశారు. వివరాల్లోకి వెళ్తే.. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2020లో కొండపల్లి, దర్శి, చింతలపూడి, పొదిలి, బుచ్చిరెడ్డిపాలెం, అల్లూరు, పెనుగొండ, డి.కొత్తకోట, బేతంచర్ల, కమలాపురం, దాచేపల్లి, గురజాల మేజర్ పంచాయతీలను నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ జీవో జారీచేశారు. అప్‌గ్రేడ్ చేసిన జీవో జారీతో పాటు అక్కడ ఉద్యోగుల మంజూరును మాత్రం పట్టించుకోలేదు. వాస్తవానికి ప్రతి నగర పంచాయతీలో కమిషనర్, డీఈ, టీపీఎస్, ఏఈ, మేనేజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల పోస్టులకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ నుంచి ఆర్థిక శాఖకు తగిన నివేదిక పంపాల్సి ఉంది. ఆ తరువాత ఆర్థిక శాఖ అనుమతితో పోస్టుల భర్తీ తగిన బడ్జెట్ విడుదల చేయాల్సి ఉంది. రాష్ట్రంలో 2020లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నగర పంచాయతీల్లో ఎక్కడా కూడా ఉద్యోగుల పోస్టులు మంజూరు చేయకుండానే గాలికొదిలేశారు. ఆ తరువాత పరిపాలన సౌలభ్యం కోసం కమిషనర్, డీఈ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సమీప నగర పంచాయతీ, పురపాలక సంఘాల నుంచి డిప్యుటేషన్‌పై పనిచేయాల్సి వస్తుంది. పిడుగురాళ్ల మున్సిపల్ పరిధిలోని ఇద్దరు ఇంజనీరింగ్ అధికారులు దాచేపల్లి, గురజాల నగర పంచాయతీలలో ఇన్‌చార్జ్‌లుగా పనిచేస్తున్నారు. మూడు చోట్ల విధులు నిర్వహించాల్సిన ఒత్తిడిలో అసలు ఎవరు ఎక్కడ ఉంటున్నారో.. ఏమి చేస్తున్నారో కూడా తెలియని గందరగోళం కనిపిస్తుంది. మున్సిపల్ కమిషనర్లు, డీఈలు కూడా ఎఫ్ఏసీలుగానే పనిచేస్తున్నారు. నగర పంచాయతీలు ఏర్పడి నాలుగేళ్లయినా డిప్యుటేషన్ పాలనే కొనసాగుతుంది. నీటిసరఫరా, పారిశుధ్యంపై తగిన బాధ్యతతో కూడిన అధికారులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితి దాచేపల్లి, గురజాల పట్టణాలతో పాటు మిగిలిన నగర పంచాయతీల్లో కూడా కనిపిస్తుంది.

కస్తూర్బా విద్యాలయం ప్రత్యేకాధికారిపై డీఈవో ఆగ్రహం


రాజుపాలెంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులతో పుస్తకాలను చదివిస్తున్న డీఈవో, ఎంఈవో

రాజుపాలెం, జూన్ 25: పాఠశాల పరిశుభ్రత.. విద్యార్థుల తల్లిదండ్రులతో వ్యవహరించే తీరుపై రాజుపాలెం కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారిపై డీఈవో వెంకటేశ్వర్లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మన పాఠశాలలోకి వచ్చిన తరువాత వారు మన బిడ్డలతో సమానం. నీవు కూడా వారిని అలాగే చూసుకోవాలని సూచించారు. మంగళవారం మండలంలోని రాజుపాలెంలో ఉన్న ఎంఈవో కార్యాలయానికి వెంకటేశ్వర్లు వచ్చారు. అనంతరం చౌటపాపాయపాలెం బస్టాండ్ వద్ద ఉన్న పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయులకు వేతనం పెంచాలని సూచించారు. అనంత రం రాజుపాలెంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి అంసతృప్తి వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి వస్తే ఇలాంటి చిరిగిపోయిన రికార్డ్సు చూపిచటం ఏమిటని మండిపడ్డారు. గతంలో వచ్చిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణతశాతం తక్కువ రావడమేమిటని ప్రశ్నించారు. వచ్చే సంవత్సరం ఇలాంటి ఫలితాలు వస్తే పరిస్థితి మరోలా ఉంటుందని హెచ్చరించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులపై స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న మీరు అసహనం వ్యక్తం చేయటంతో పాటు వారిని పాఠశాల ప్రహరీ గేటు లోపలికి కూడా రానివ్వడం లేదని తెలుస్తుంది. విద్యార్థుల తల్లిదండ్రులతో మనం స్నేహ పూర్వకంగా వ్యహరించాలని చెప్పారు. ఈ ప్రాంతం చాలా వెనుకబడిందని విద్యార్థుల తల్లిదండ్రులు సమయంతో సంబంధం లేకుండా వస్తారని వారికి భోజనం పెట్టి మంచిగా మాట్లాడి వారి పిల్లల గురించి వారికి తెలియజేయాలన్నారు. పాఠశాలలో ఉన్న మెస్‌ను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. పరిశుభ్రత విషయం చాలా వెనుకబడినట్లు చెప్పారు. మరోసారి ఇలా అపరిశుభ్రంగా ఉంటే ఉపేక్షించబోనని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈవో మల్లికార్జునశర్మ, తదితరులు ఉన్నారు.

బడిబయట పిల్లలను గుర్తించాలి : డీఈవో

ముప్పాళ్ళ జూన్ 25: బడి బయట పిల్లలను గుర్తించి వారి సామర్థ్యాన్ని గుర్తించి వారిని తగిన విధంగా తరగతుల్లో చేర్పించాలని డీఈవో ఎం వెంక టేశ్వర్లు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో, ప్రదానోపాధ్యా యులతో నేను బడికి పోతా కార్యాక్రమంపై అవగాహన కల్పించారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్యాంశాల బోధనకు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూ చించారు. ప్రతి విద్యార్థికి అర్థమయ్యేల నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో అన్నారు.

ప్రతి కౌలురైతు తప్పనిసరిగా కార్డు కలిగి ఉండాలి

● వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్


88 తాళ్ళూరులో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్

క్రోసూరు, జూన్ 25 : పొలం కౌలుకు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా కౌలు రైతు కార్డులు కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్, తహసీల్దార్ ఎం సువర్ణ అన్నారు. మంగళవారం మండలంలోని 88 తాళ్ళూరు, గుడిపాడు గ్రామాల్లో జరిగిన కౌలు రైతుకార్డుల అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తహసీల్దార్ సువర్ణ మాట్లాడుతూ కౌలు రైతులు తగిన పత్రాలతో తహసీల్దార్ కార్యాలయానికి వస్తే కార్డులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పొలం యజమాని పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, కౌలు రైతు ఆధార్‌కార్డు, మూడు పాసుపోర్టు సైజు ఫోటోలు తీసుకొని కార్యాలయానికి వస్తే కౌలు రైతు కార్డులు ఇస్తామని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. 88 తాళ్ళూరులో 414 మందికి, గుడిపాడులో 208 మందికి కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలియజేశారు. కౌలు రైతులు ప్రభుత్వం నుంచి ఏ ప్రయోజనాలు పొందాలన్నా రెవెన్యూ శాఖ వారిచే కౌలు రైతు పత్రాలు అవసరమవుతాయని వారు తెలియజేశారు.

చిగురుపాడులో కౌలు రైతులకు అవగాహన సదస్సు

అచ్చంపేట, జూన్ 25 : మండలంలోని చిగురుపాడు, కోనూరు, కస్తల గ్రామాల్లోని కౌలు రైతులకు మంగళవారం అవగాహన సదస్సులు జరిగాయి. అచ్చంపేట మండల వ్యవసాయశాఖ అధికారి పీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ భూ యజమానుల హక్కులకు భంగం కలగకుండా పంట సాగుదారుల పత్రాలను 11 నెలల కాల పరిమితితో అర్హులైన రైతులందరికీ సాగుదారు పత్రాలు అందిస్తామన్నారు. కౌలుకు సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా పంట సాగుదారు హక్కు పత్రం తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ గంధం కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్డుల ద్వారా పంట నమోదుకు, పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర పొందాలన్నా, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్ట పరిహారం, పెట్టుబడి సాయం వంటి ప్రభుత్వ పథకాలు పొందటానికి ఈ పత్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నల్లమేకల వెంకటేశ్వర్లు, వీఆర్‌వో నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకుడు, రైతులు పాల్గొన్నారు.

కండ్లకుంట, చాగల్లులో కౌలు రైతులకు అవగాహన

నకరికల్లు, జూన్ 25 : మండలంలోని చాగల్లు, కండ్లకుంట గ్రామాల్లో మంగళవారం కౌలు రైతుల అవగాహన సమావేశాలు నిర్వహించారు. కౌలుకు భూమికి సాగు చేస్తున్న రైతులందరూ కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలని ఏవో కే దేవదాసు కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో వీ బ్రహ్మయ్య, వీఏఏ ఎం శ్రీనివాసరావు, రావెల లింగయ్య, మద్దుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన


చిన్నారుల తల్లులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కారంపూడి, జూన్ 25: కారంపూడి తోటబజారులోని అంగన్‌వాడీ కేంద్రం లో డయేరియా నివారణపై చిన్నారుల తల్లులకు మంగళవారం వైద్య సిబ్బం ది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అచ్చమ్మ, ఆశావర్కర్ విమల, హెల్పర్ రోజ్‌మేరి తదితరులు పాల్గొన్నారు.

ఒకటిన గ్రామ సభలు నిర్వహించాలి

నకరికల్లు, జూన్ 25 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జూలై ఒకటిన గ్రామ సభలు నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నకరి కల్లు మండల సభ్యులు షేక్ ముజావర్‌జాన్ అహమ్మద్ మంగళవారం ఎంపీడీవో డీ జయమణికి వినతిపత్రం అందజేశారు. జీవో నెంబరు 791ని అనుసరించి గ్రామసభలు నిర్వహించటం ద్వారా గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలుసు కొనే అవకాశం ఉంటుందని ఐక్య వేదిక సభ్యులు అభిప్రాయపడ్డారు. గ్రామ సభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీ విశ్వేశ్వరరావు, ఎం వెంకటేశ్వర్లు, టీపీ గిరి, ఆర్ రాజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మినీ వాటర్ ట్యాంకుల క్లీనింగ్

మాచవరం, జూన్ 25: మండలంలోని వేమవరంలో మంగళవారం మినీ వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. ఇటీవల పల్నాడు ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో అతిసార ప్రబలడంతో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా జిల్లా, మండల అధికారుల ఆదేశానుసారం మినీ వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్, సున్నంతో శుభ్రం చేయించారు. అదేవిధంగా మురుగు కాల్వల్లో ఉన్న మంచినీటి పైపులను తీసి పైకి కట్టారు. దీంతో పాటు కాల్వల్లో మురుగును కూడా తొలగించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలగాని శివ, గోళ్ల గంగాధర్, ఏసుపొంగు ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివప్రసాద్ తదితరులున్నారు.

మోర్జంపాడులో నేను బడికి పోతా

మాచవరం, జూన్ 25: మండలంలోని మోర్జంపాడులో మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థు లకు కిట్స్ పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లు, తదితర పాఠశాలకు సంబంధించిన వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు గడిపూడి సైదయ్య, దున్నా చెన్నయ్య చౌదరి, కంబాల శివ, కోనంకి వెంకట్, పోలిశెట్టి పాపయ్య, జమ్మి గుంపుల వెంకటరావు, చింకా నాగేశ్వరరావు, తాళ్లూరి రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు

చేజర్ల అటవీ ప్రాంతంలో 400 లీటర్ల బెల్లంఊట స్వాధీనం


బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐలు, సిబ్బంది

నకరికల్లు, జూన్ 25: చేజర్ల అటవీ ప్రాంతంలో పులిబోడు వద్ద మంగళవారం 400లీటర్ల బెల్లం ఊట స్వాధీనం చేసుకున్నారు. నరసరావుపేట సెబ్ ఎస్ఐ మొగల్‌బాబు, నకరికల్లు ఎస్ఐ కే నాగేశ్వరరావు తమ సిబ్బందితో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ ప్రాంతంలో నాటు సారా కాస్తున్నారని ప్రత్యేక దృష్టి సారించి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సారా తయారు చేసినా, అమ్మినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిలు జారీ చేశారు.

ప్రాజెక్టు స్థాయి అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం

అచ్చంపేట, జూన్ 25: అచ్చంపేటలోని సాయిబాబా కల్యాణ మండపంలో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం జరిగింది. జిల్లా పీడీ కే ఉమారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రాజెక్టు స్థాయి అధికారి ఉమామహేశ్వరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల నిర్మూలన, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాల గురించి పోషకాహార పంపిణీ తదితర వాటిపై వివరించారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలు నిర్వహించే విధానం, కిచన్, గార్డెన్ నిర్వాహణ గురించి తెలిపారు. ఐదు మండలాల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చే పాలన అందిద్దాం

● అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందాలి

● కక్ష సాధింపు చర్యలు వద్దు : ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్


25పీకేపీ1, మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, జూన్ 25: ప్రజలు మెచ్చే పాలన అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో క్రోసూరు మండల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ ఆశీర్వదిస్తేనే అధికారంలోకి వచ్చామన్నారు. ఎటువంటి భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని, నాయకులంతా సమన్వయంతో కలసి ముందుకు సాగాలని, జనసేన, బీజేపీ నాయకులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అందరూ పని చేయాలన్నారు. నాయకులంతా సమన్వయంతో ఉండాలని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. జనసేన, బీజేపీ మద్దతుతో అధికారంలోకి వచ్చామని, వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని నాయకులకు సూచించారు.


టీడీపీ నేత మన్నెం శివనాగమల్లేశ్వరరావు మంగళవారం రాష్ట్ర విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో ఘనంగా సన్మానించారు. (సత్తెనపల్లి)

మంత్రి అనగానిని కలిసిన సాంబశివారెడ్డి, వరప్రసాదు


రాష్ట్ర మంత్రి అనగాని సత్య ప్రసాదును కలసిన టీడీపీ రాష్ట్ర నాయకులు సాంబశివారెడ్డి, వరప్రసాదు

పెదకూరపాడు, జూన్ 25: మంత్రి అనగాని సత్యప్రసాదును టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఎంవీవీఎస్ వరప్రసాదు మంగళవారం కలిశారు. విజయవాడలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నా సంతకాన్ని ఫోర్జరీ చేసి రుణం పొందారు

● తహసీల్దార్ గీతావాణి ఆరోపణ


తహసీల్దార్ గీతావాణి

దాచేపల్లి, జూన్ 25: తన సంతకాన్ని ఫోర్జరీ చేసి బ్యాంకు నుంచి పంట రుణాలు పొందినట్లు దాచేపల్లి తహసీల్దార్ గీతావాణి ఆరోపించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ తహసీల్దార్‌గా తన సంతకాన్ని జూనియర్ అసిస్టెంట్ భాస్కరరావు పట్టాదారు పాస్‌పుస్తకాలపై ఫోర్జరీ చేసి బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందినట్లుగా తమకు సమాచారం అందినట్లు వివరించారు. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి ఒకరిద్దరిపై తనకు అనుమానం ఉందని, పూర్తి స్థాయిలో వాస్తవాలను తెలుసుకుంటామని తెలిపారు. ఈ మేరకు దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించారు. అదేవిధంగా జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు కూడా తెలియజేశామన్నారు. మండలంలోని భట్రుపాలెం గ్రామానికి చెందిన భూమిపత్రాలపై తప్పుడు సంతకాలు పెట్టి రుణాలు పొందినట్లుగా తమదృష్టికి వచ్చిందని, పూర్తి వాస్తవాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తామని తహసీల్దార్ గీతావాణి పేర్కొన్నారు. అంతేకాకుండా ఫోర్జరీ చేసిన వ్యక్తుల వద్ద తహసీల్దార్ స్టాంపు ముద్ర కూడా ఉన్నట్లుగా అనుమానం వ్యక్తం చేశారు. ఈ సంఘటనతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది అప్రమత్తమయ్యారు. పూర్తి వివరాలు రెండు రోజుల్లో తెలియజేస్తానని తహసీల్దార్ తెలిపారు.

పూడిక తీత పనులు ప్రారంభం


పూడిక తీత పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ షమ్మి

సత్తెనపల్లి, జూన్ 25: ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు పురపాలక సంఘం పరిధిలో మంగళవారం నుంచి కాలువల్లో పూడిక తీత పనులు ప్రారంభమయ్యాయి. వర్షాకాలం నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా లోతట్టు ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా కాలువల్లో పూడిక తీతలు తీయాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ షమ్మి ఆధ్వర్యంలో పట్టణంలో పూడిక తీత పనులు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రధాన వీధులన్నింటిలో ఉన్న కాలువల్లో పూడికతీత పనులు చేయిస్తామని మున్సిపల్ కమిషనర్ షమ్మి తెలిపారు.

కేవీఆర్ మార్ట్‌ను సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు


షెట్టర్‌కు అంటించిన నోటీసు



సీజ్ చేసిన కేవీఆర్ మార్టు

సత్తెనపల్లి, జూన్ 25: పట్టణంలోని వావిలాల కాంప్లెక్స్‌లో నిర్మించిన కేవీ ఆర్ మార్ట్‌ను మంగళవారం మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. మార్టును నిర్వహిస్తున్న వైసీపీ నేత కల్లం విజయభాస్కర్‌రెడ్డి పురపాలక సంఘానికి రూ.2 లక్షల వరకు అద్దె బకాయి చెల్లించాల్సి ఉంది. బకాయి చెల్లించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ విజయ భాస్కర్‌రెడ్డి స్పందించకపోవటంతో మున్సిపల్ అధికారులు ఆ దుకాణాన్ని సీజ్ చేసి నోటీసులు అంటించారు. విజయభాస్కర్‌రెడ్డి వైసీపీ నాయకుడు కావటంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో తన అధికారాన్ని వినియోగించి పురపాలక సంఘానికి చెల్లించాల్సిన అద్దె చెల్లించకపోవటంతో పురపాలక సంఘానికి రూ.2లక్షలు అద్దె బకాయి పేరుకుపోయింది. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించి మార్టును సీజ్ చేశారు.

ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి పరామర్శ

క్రోసూరు, జూన్ 25 : రోడ్డు ప్రమాదంలో క్రోసూరు ఎస్సీ కాలనీకి చెందిన జొన్నలగడ్డ మీరయ్య అనే వ్యక్తి మరణించగా ఆయన కుటుంబసభ్యులను పలువురు టీడీపీ నాయకులు మంగళవారం పరామర్శించారు. ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మీరయ్య మరణించాడు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మీరయ్య కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు కాంధ్రు కాశయ్య, అనుముల వెంకట రామిరెడ్డి, నలజాల కోటేశ్వరరావు, దుద్దుల యోహాన్, గనుపల్లి రాజశేఖర్, చిలకా ఆదెయ్య, బోడెపూడి జీవరత్నం, బంకా వెంకటరావు, రుద్రపోగు సురేష్ తదితరులు మీరయ్య మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

కార్పొరేట్ స్థాయి వైద్యం అందించటమే లక్ష్యం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట లీగల్, జూన్ 25: సామాన్యుడికి ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం తెలిపారు. ఆయన మంగళవారం సాయంత్రం ప్రజలకు అందించాల్సిన మెరుగైన వైద్యసేవలపై రెండు గంటలపాటు ప్రభుత్వ వైద్యశాల వైద్యులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించటానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పట్టణంలోని సీనియర్ వైద్యుల సలహాలు, సూచనలతో ప్రభుత్వ వైద్యశాలలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తామన్నారు. పట్టణంలో సమర్థులైన హృదయ, న్యూరో వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. పాత వైద్య శాలలోని తల్లి బిడ్డల వైద్య విభాగాన్ని డయాలసిస్ విభాగాన్ని, లింగంగుంట్లలోని నూతన వైద్యశాలకు తరలిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న రెండు వందల పడ కల స్థాయిని 350 పడకల స్థాయికి చేర్చి జిల్లాస్థాయి వైద్యశాలగా పెంపొందించేం దుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి వైద్యశాలలో శానిటేషన్, నీటి సరఫరా సమ స్యగా ఉందన్నారు. వీటి పరిష్కారానికి ప్రభుత్వ వైద్యులు డాక్టర్ లక్కిరెడ్డి వెంకటే శ్వరరెడ్డిని ఛైర్మన్‌గా వైద్యశాల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఏ విధమైన సలహా, సహకారాలు కావాలన్నా, వైద్యులకు ఛైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి అందుబాటులో ఉంటారన్నారు. త్వరలో ప్రభుత్వ వైద్యశాలలో సీటీ స్కాన్ యూనిట్లు కూడా ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్ర మంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, డాక్టర్ రంగారావు, డాక్టర్ మంత్రునాయక్, ఆరోగ్య శ్రీ కో-ఆర్డినేటర్, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికాంత్

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి: ఎంపీడీవో

నరసరావుపేట రూరల్, జూన్ 25: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రవికాంత్ అధికారులను ఆదేశించారు. నరసరావు పేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవికాంత్ ఆధ్వర్యంలో డయేరియా, పారిశు ధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్యాంకులను సకాలంలో శుభ్రపర చడం, ట్యాంక్ దగ్గర శుభ్రపరిచే తేదీని ప్రదర్శించడం గురించి ప్రస్తావించారు. మలేరియా, డెంగీ వ్యాధులు మొదలైన వాటిని నివారించడానికి ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఇంజినీరింగ్ అసి స్టెంట్లు ఓహెచ్ఆర్ కోసం క్లోరినేషన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భాష కోరారు. క్లీనింగ్, ఫిల్లింగ్ తర్వాత ఓహెచ్ఆర్ కోసం మూతలు వేసేలా చూసుకోవా లన్నారు. క్లోరినేషన్ విధానాన్ని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు చురుగ్గా పాల్గొని మండలంలో ఎలాంటి డయేరియా కేసులు తలెత్తకుండా చూడాలని ఈవోపీఆర్డీ కేవీ.శివప్రసాద్ సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శు లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ ద్వారక తిరుమలరావుకు శుభాకాంక్షలు



డీజీపీ ద్వారక తిరుమలరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

నరసరావుపేట టౌన్, జూన్ 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీగా నూతన బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ ద్వారక తిరుమలరావును మర్యాద పూర్వకంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు మంగళవారం కలిసి శుభా కాంక్షలు తెలియజేశారు. డీజీపీ కార్యాలయ ముఖ ద్వారం వద్ద దివ్యాంగుల కోసం 2016 చట్టం ప్రకారం ర్యాంప్ ఏర్పాటు చేయమని విన్నవించారు. ఆయన వెంటనే స్పందించి సిబ్బందికి ర్యాంపు ఏర్పాటుకు ఆదేశించారు. రాష్ట్రంలో గాడి తప్పిన పోలీస్ వ్యవస్థను సక్రమ మార్గంలో నడిపించి ప్రజల మన్ననలు పొందా లని గోనుగుంట్ల కోరారు.



మతుకుమల్లిలో అడ్మిషన్ పత్రాలు అందజేస్తున్న ఎంఈవోలు


బడిబయటి పిల్లలను పాఠశాలలో చేర్పించడమే లక్ష్యం

● మండల విద్యాశాఖాధికారి సాంబశివరావు

మతుకుమల్లి (శావల్యాపురం) జూన్ 25: వివిధ కారణాలతో బడిమానేసిన పిల్లలకు విద్య ఆవశ్యకత, పాఠశాలలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివ రించి వారిని తిరిగి పాఠశాలలలో చేర్పడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని మతుకుమల్లి గ్రామాన్ని ఎంఈవో-2 పుసులూరి లలితకుమారితో కలసి ఆయన మంగళవారం సందర్శించారు. విద్య ఆవశ్యకతను తెలియజేస్తూ గ్రామంలోని జడ్పీ పాఠశాల నుంచి ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్తగా పాఠశాలలో చేరిన పిల్లలకు అడ్మిషన్ పత్రా లను అందజేసి వారికి ప్రభుత్వం అందించిన స్కూల్‌కిట్స్‌ను పంపిణీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్థాయి అధికారులు, అంగనవాడీలు, వలంటీర్లు గ్రామంలో బడిమానేసిన పిల్లల ఇళ్ళకు వెళ్ళి కారణాలు కనుక్కొని వారంతా నూరుశాతం బడిలో చేరేలా పర్యవేక్షణ చేయాలన్నారు. అనం తరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్నభోజనం తదితర అంశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు ఆధునిక విద్యాబోధనను అనుసరించి బోధనా ప్రణాళికలను తయారు చేసుకొని విద్యా ర్థులలో సామర్థ్యాలను పెంచాలని, వారిని అన్నిరంగాలలో తీర్చిదిద్దాలని సూచిం చారు. హెచ్‌ఎంలు కృష్ణతులసి, శ్రీనివాసమూర్తి, గాయత్రి, ఉపాధ్యాయులు నాగేశ్వ రరావు, కోటిరత్నం, కళ్యాణి, సీఆర్పీ ఎలికా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చేజర్ల అటవీ ప్రాంతంలో

400 లీటర్ల బెల్లంఊట స్వాధీనం



బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్న ఎస్ఐలు, సిబ్బంది

నకరికల్లు, జూన్ 25: చేజర్ల అటవీ ప్రాంతంలో పులిబోడు వద్ద మంగళవారం 400లీటర్ల బెల్లం ఊట స్వాధీనం చేసుకు న్నారు. నరసరావుపేట సెబ్ ఎస్ఐ మొగల్ బాబు, నకరికల్లు ఎస్ఐ కే నాగేశ్వరరావు తమ సిబ్బందితో సంయు క్తంగా దాడులు నిర్వ హించారు. ఈ ప్రాంతంలో నాటు సారా కాస్తున్నారని ప్రత్యేక దృష్టి సారించి దాడు లు నిర్వహించినట్లు తెలిపారు. సారా తయారు చేసినా, అమ్మినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

మేజర్ కాలువల్లో పిచ్చిచెట్లు తొలగించరూ...



మేజర్ కాలువలో పెరిగిన పిచ్చిచెట్లు

● సాగునీటి కోసం వేల్పూరు రైతుల ఆందోళన



పిచ్చిచెట్లతో మూసుకుపోయిన పొలాలకు వెళ్లే రహదారి

వేల్పూరు (శావల్యాపురం) జూన్ 24: గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఎన్నెస్పీ కెనాల్‌లకు గానీ, మేజర్ కాలువలకు గానీ చిన్నపాటి మరమ్మతులు కూడా చేయించ కపోవడంతో పిచ్చిచెట్లు దట్టంగా పెరిగి సాగు, తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని అన్నవ రప్పాడు మేజరు కాలువకట్టకు ఇరువై పులా పిచ్చిచెట్లు పెరిగి కాలువలోకి వాల డంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. పిచ్చిచెట్లతో పొలాలకెళ్ళే రోడ్డు కూడా మూసుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్ప డుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయకట్టు గ్రామాలైన వేల్పూరు, వెలమావారిపాలెం, గోగులపాడు, అలవాల, వెల్లలచెరువు తదితర గ్రామాల పరిధిలో సుమారు 15వేల ఎకరాల సాగుభూమి ఉందని, చివరి పొలాల వరకు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో పొలా లను సాగుచేయడం కష్టతరంగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో ఖరీఫ్‌సీజన్ ప్రారంభం కానున్నందున ప్రభుత్వం స్పందించి కాలువ కట్టలపై పిచ్చిచెట్లు తొలగించి పొలాలకు పూర్తిస్థా యిలో సాగునీరందేలా చర్యలు చేపట్టాలని రైతులు నాగులపాటి రాము, యలవర్తి కృష్ణయ్య, కొండ్రు నాగేశ్వరరావు, గుత్తా సీతారామయ్య, మాచం పేరయ్య తదితరులు కోరారు.

గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి



ప్రత్తిపాటికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కస్తూర్బా గాంధీ విద్యాలయాల వసతి గృహాల సిబ్బంది

చిలకలూరిపేట అర్బన్, జూన్ 25: సాధ్యమైనంత త్వరగా నియో జకవర్గంలోని ప్రతి గ్రామానికి స్వచ్ఛ మైన తాగునీరు అందిస్తామని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. జలజీవన్ మిష న్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేసుకొని ఇంటింటికి కుళాయి కనెక్షన్ల ద్వారా రక్షిత తాగునీటి సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. మంగళవారం చిలకలూరి పేట పట్టణంలోని ప్రత్తిపాటి క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ కమిష నర్, పలువురు ప్రభుత్వ అధికారులతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సమీక్షించారు. పల్నాడు జిల్లా పంచాయతీ రాజ్ ఈఈ, పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూడా ఈ సమావేశానికి హాజ రయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పెండింగ్ పనులపై ఆరాతీసిన ప్రత్తిపాటి పలు అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయాయని, వాటిని త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నియో జక వర్గంలోని ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్న హామీకి అనుగుణంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచనలు చేశారు. ప్రతి కుళాయి నుంచి స్వచ్ఛమైన తాగునీరు అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. పాడై పోయిన, పాత బడిన తాగునీటి పైపులైన్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పగుళ్ళు, అపరిశుభ్ర వాతావరణం ఉన్న ప్రదేశాల నుంచి వచ్చే పైపులైన్ల నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామాల్లో ప్రధాన సమస్యల పరి ష్కారానికి కట్టుబడి ఉన్నారన్నారు. అనంతరం నియోజకవర్గంలో జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, పోతవరం, నాదెండ్ల, కస్తూర్బా గాంధీ విద్యాలయాల వసతి గృహాల సిబ్బంది ప్రత్తిపాటిని మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కూటమికి దైవ బలం తోడుగా ఉంది: ప్రత్తిపాటి

నాదెండ్ల, జూన్ 25: దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు ఎల్లవేళలా దైవ బలం తోడుగానే ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని గణపవరంలోని కోదండ రామాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో పుల్లారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయనకు వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దేవాల యంలో ప్రత్యేక పూజలుచేసి వేద పండితులు ఆశీర్వదించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అధికారాన్ని పెత్తనం చెలా యించటానికి కాకుండా బాధ్యతగా భావించే చంద్రబాబు లాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆయనతో పాటు మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కే సుందరరావు, టీడీపీ నాయకులు పెంటాల శేషయ్య, కే అచ్చయ్య, నరసిం హారావు, గాలి బుచ్చయ్య, కందుల రమణ, తూబాటి శ్రీహరి, ఆధ్యాత్మిక వేత్త టీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా వైసీపీ జిల్లా కార్యాలయం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆరోపణ



నరసరావుపేటలో నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, గోనుగుంట్ల తదితరులు

నరసరావుపేట రూరల్, జూన్ 25: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరా వుపేట పట్టణంలోని లింగంగుంట్లలో వైఎస్ఆర్ పార్టీ జిల్లా కార్యాలయం ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించారని ఎమ్మెల్యే డాక్టర్ చదల వాడ అరవిందబాబు ఆరోపించారు. నరసరావుపేట పట్టణంలో నూత నంగా నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయం అక్రమంగా నిర్మించారని మంగళవారం వుడా అధికారులు నోటీసులు అంటించారు. వైసీపీ అక్ర మంగా నిర్మించిన జిల్లా పార్టీ కార్యాలయంను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. వైసీపీ కార్యాలయంలో వుడా అధికారులు అంటించిన నోటీసులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర నాయకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, కపిలవాయి విజయకు మార్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని అనుమతులున్నాయి: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని లింగంగుంట్ల గ్రామంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయానికి అన్నిరకాల ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపి రెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేవలం రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కార్యాలయానికి నోటీసులు అంటించారని ఆరోపించారు. వైసీపీ కార్యా లయం నిర్మాణంకోసం ప్రభుత్వం నుంచి తీసుకున్న అనుమతులు, జీవో నెంబర్లను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వివరించారు.

డాక్టర్ అంజిరెడ్డి హాస్పటల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

నరసరావుపేట లీగల్, జూన్ 25: పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ అంజిరెడ్డి వైద్యశాలను మంగళవారం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సందర్శించారు. అద్భుతమైన వైద్య సేవలు అందిస్తూ జిల్లాకు పేరు తెచ్చాయన్నారు. జిల్లాలో మొదటిసారిగా ఏఎస్‌టీ క్లోజర్‌తో పేషెంట్‌కు గుండె గదులను వేరుచేసి మిషన్ ద్వారా ప్రాణాలు కాపాడినట్టు నిర్వాహకులు తెలిపారు. కాక్లియర్ ఇన్‌ప్లాంట్లు అమర్చటం ద్వారా మూగ, చెవిటి పిల్లలకు జీవితాల్లో వెలుగులు నింపి వారి తల్లిదండ్రులకు సమాజంలో గౌరవం ఏర్పరిచామన్నారు. కార్యక్ర మంలో వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శబరిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి: జీవీ



బొల్లాపల్లిలో బడికి పోదాం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన తదితరులు

బొల్లాపల్లి, జూన్ 25: ప్రైవేట్ పాఠ శాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనే యులు పిలుపునిచ్చారు. స్థానిక మండల కేంద్రం బొల్లాపల్లిలో ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ గురు కుల పాఠశాల, జడ్పీ హైస్కూల్‌లో నేను బడికి పోతా, పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు, బడిలో అనే కార్యక్ర మంలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మోడల్ స్కూల్‌లో, కస్తూర్బా పాఠశాలలో, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసే పుస్తకాలు, బ్యాగ్‌లు, బుక్స్, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నోట్ బుక్స్‌ను, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. బొల్లాపల్లి మోడల్ స్కూల్‌లో వివిధ గ్రామాల నుంచి మోడల్ స్కూల్‌కు వచ్చేందుకు బస్సు లేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి త్వరలోనే నాయుడుపాలెం, సంగినీ డుపాలెం విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. నాణ్యమైన విద్యను అందించిన ఉపాధ్యాయులకు ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే టాప్-5 విద్యార్థులకు శివశక్తి లీలాఅంజన్ ఫౌండేషన్ ద్వారా మెరిట్ స్కాలర్ షిప్‌లు అందిస్తామన్నారు. కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థినులను భోజన వసతి, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తమకు తాగునీటి వసతి సరిగాలేదు, భోజనం కూడా రుచిగా ఉండటం లేదు, సరిపడా వసతులు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఎంఈవో మాట్లాడి విద్యార్థులకు నాణ్యమైన విద్యను, భోజన వసతిని విద్యార్థులకు కల్పించాలని ఆదేశిం చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం నిర్మించే ప్రభుత్వమే గాని కూల్చే ప్రభుత్వం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమార్, సర్పంచ్ శిఖా జోత్స్న, టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, ఆళ్ళ మన్నెయ్య, వాసుదేవరెడ్డి, హనుమా నాయక్, రంగయ్య, పాఠశాల ప్రిన్సిపాల్స్ పార్వతి, ఎంఈవో పార్వతి, ఆయా స్కూళ్ళ ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీడీపీ నాయకులు చల్ల వెంకట్, అంజి, బత్తుల కాళంగి రాజు, మహంకాళి, ఆళ్లకుంట గంగా రావు, వల్లెపు అంకమరావు, వల్లెపు వెంకటేశ్వర్లు, ఓర్సు ఏడుకొండలు, నారా యణ, చల్లరాజు, దానయ్య, సాంబశివ రావు, ముసలయ్య, ఏడుకొండలు, ప్రసాద్, మహేష్, కుంచాల ధానరావు, గుంజి సందీప్, సుధీర్‌కుమార్, నరసిం హరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

వినుకొండ, జూన్ 25: ఎన్డీఏ కూటమితో పాటు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా నియోజకవర్గంలోని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో కొమెర వెంకటరాయుడు, బండారు శివయ్య, బండారు గురవయ్య

హిమాలయ గురువుకు జీవీ సత్కారం

వినుకొండ, జూన్ 25: విఠంరాజు పల్లి గ్రామ సమీపంలోని శాంతి ఆశ్రమ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు, కొండపై ఉన్న రామలింగేశ్వర స్వామి అఖండ జ్యోతి ప్రదాత హిమాలయ గురూజీని ఎమ్మెల్యే జీ.వీ.ఆం జనేయులు పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సోమవారం కలిసి పూలమాలతో గురూజీని సత్కరించి ఆశీర్వాదం పొందారు. ఆంజనే యులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆశ్రమం బాగా అభివృద్ధి చెందా లని, గురూజీ నియోజకవర్గం ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని కోరారు. మక్కెన మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే రామలింగేశ్వరస్వామి తిరునాల పర్వదినం సందర్భంగా గురూజీతో చర్చలు జరిపారు. కార్యక్ర మంలో ట్రస్టు నిర్వాహకులు పుండాల మోహనరావు, కనిగండ్ల రామకోటే శ్వరరావు, కాశీ, సురేష్, సుధాకర్, బ్రహ్మం, టీడీపీ సీనియర్ నాయకులు గట్టుపల్లి శ్రీనివాసరావు, విశ్వనాథం, న్యాయవాదులు సైదారావు, కోటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

జీవీ ఆంజనేయులు గెలిచియున్నాడు అనే వాక్యాన్ని సంజీవ్‌గాంధీ నగర్ చెందిన 9వ తరగతి విద్యార్థి వేముల రజిని రామకోటిలా నాలుగు పుస్త కాలు రాశారు. సమాచారం తెలుసుకున్న జీ.వీ ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి రజినీతోపాటు, కుటుంబ సభ్యులను సోమవారం పిలిపించుకుని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. రానున్న రోజుల్లో బాగా చదివి మంచి మార్కులు సాధించి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

కొండ్రముట్లలో ఆలయ వార్షికోత్సవం

కొండ్రముట్ల (ఈపూరు) జూన్ 25: మండలంలోని కొండ్రముట్ల గ్రామంలో మంగళవారం అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు జరిపించారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నిశ్శంకరరావు శ్రీనివాసరావులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తు లకు అన్నదానం నిర్వహించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

● తల్లి దహన సంస్కారాల వెళ్లి వస్తుండగా ఘటన



మౌలాలీ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జీవీ, పక్క మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండటౌన్, జూన్ 25: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన వెల్లటూరు రోడ్డులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బంధు వులు తెలిపిన వివరాలను పరిశీ లిస్తే బొల్లాపల్లి మండలం రామా పురం గ్రామానికి చెందిన షేక్ మౌలాలీ(41) రామాపురంలో తల్లి దహన సంస్కారాల అనంతరం తిరిగి ద్విచక్ర వాహనంపై విను కొండ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే జీ.వీ. ఆంజనేయులు, పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలో మౌలాలీ మృతదేహానికి సందర్శించి పూలమా లతో నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు మౌలాలీ పట్టణంలోని 22వ వార్డులో నివాసం ఉంటూ, వంట పని చేస్తూ జీవనం సాగించేవాడని, ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసునమోదు చేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

కేంద్ర జలవనరుల సంఘం నిర్ణయం హర్షణీయం

నాదెండ్ల, జూన్ 25: ఎగువ రాష్ట్రాలు అక్రమ నీటి వినియోగాన్ని అడ్డుకోవాలని కేంద్ర జలవనరుల సంఘం నిర్ణయం తీసుకోవటం హర్షణీయమని కిసాన్ సెల్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బొడ్డపాటి రామకోటేశ్వరరావు తెలిపారు. కృష్ణా రిజ ర్వాయర్లకు వచ్చే వరద జలాలను బచావత్ ట్రిబ్యునల్ నిబంధనలను అతిక్ర మించి ఎగువ రాష్ట్రాలు నీటిని వాడుకోవటం అక్రమమన్నారు. నీటిని కరెంటు ఉత్పత్తికి వాడుకోవటమే కాకుండా అవసరం లేనప్పుడు వరద జలాలను కిందికి విడుదల చేయటం ద్వారా సముద్రంలోకి వృథాగా నీరు పోతుందన్నారు. దీంతో అన్నివిధాలుగా రాష్ట్రం నష్టపోతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల దిగువన ఉన్న ఆంధ్ర రాష్ట్రానికి సాగునీరు, తాగునీరు కొరత ఉండదని పేర్కొన్నారు.

నిధులు మళ్లింపుపై చర్యలు తీసుకోవాలి

● కేంద్ర పంచాయతీ రాజ్ కార్యదర్శికి జాస్తి వినతి



కేంద్ర పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న జాస్తి వీరాంజనేయులు, మునిరెడ్డి

నరసరావుపేట, జూన్ 25: పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు మళ్లింపుపై చర్యలు తీసు కోవాలని అఖిల భారత పంచా యతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజ నేయులు కోరారు, ఈ మేరకు కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ ఉప కార్యదర్శి విజయకుమార్‌ను మంగళవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థికసంఘం నిధులు రూ.998.84 కోట్లు పంచా యతీలకు జమచేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. నిధులు మళ్లించిన రాష్ట్ర అధికారు లపై చర్యలు తీసుకోవాలని కోరారు. మూడు సంవత్సరాలలో కేంద్ర ఆర్థిక సంఘం నిధులను వేల కోట్ల రూపా యలను పంచాయతీలకు స్థానిక సంస్థలకు ఇవ్వకుండా స్థానిక ప్రజా ప్రతినిధు లను, గ్రామీణ ప్రాంత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలు, స్థానిక సంస్థలకు జమచేసేలా చర్యలు తీసుకుం టామని విజయ కుమార్ హామీ ఇచ్చారని జాస్తి తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.మునిరెడ్డి పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్లు పంపిణీ

ఈపూరు,జూన్25: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు విద్యా కానుక కిట్లును మంగళవారం పంపిణీ చేశారు. మండలంలో 4609 విద్యార్థులకు కిట్లు అందజేసినట్లు విద్యాశ్యాఖాధికారులు తెలిపారు. అగ్నిగుండాలలో స్కూల్‌లో టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం పుస్తకాలు,దుస్తులు,యూనిఫాం పంపిణీ చేసిందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతశిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఉపా ధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సత్రశాల ఆలయానికి దేవతా విగ్రహాలు



టీటీడీ అందజేసిన దేవతా మూర్తుల విగ్రహాలు

రెంటచింతల, జూన్ 25: పల్నాట ప్రముఖ శైవక్షేత్రం కృష్ణానది ఒడ్డున గల సత్రశాల లోని శ్రీగంగా భ్రమరాం బసమేత మల్లికార్జున స్వామి వార్ల ఆలయాని కి టీటీడీ బోర్డు రెండో వి డతగా సిద్ధిబుద్ధి గణప తి, అన్నపూర్ణేశ్వరీ, శ్రీవ ల్లిదేవసేన సుబ్రహ్మణ్య స్వామి వారితో పాటు మరో నాలు గు విగ్రహాలను అందజేసినట్లు సత్రశాల ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బి.బ్రహ్మారెడ్డి చెప్పారు. ఈ విగ్రహాల మంజూరు నిమిత్తం తమ వంతు వాటాగా రూ.1.93 లక్షలు చెల్లించామన్నారు. గతంలో శివపార్వతులు, రా మలక్ష్మణుడు, వీరభద్రుని పంచలోహ విగ్రహాలను అందజేశారన్నారు. నవంబరు లో స్ఫటిక స్పర్శ శివలింగాన్ని జైపూర్ నుంచి తెచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు.

అమరేశ్వరుడిని దర్శించిన మంత్రి సుభాష్

అమరావతి, జూన్ 25: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచా ముండికా సమేత అమరేశ్వరాలయంను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ మంగళవారం ఉదయం సందర్శించారు. మంత్రి సుభాష్‌కు ఆలయ మర్యాదలతో అర్చకులు, ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. అర్చకులు మంత్రి పేరుమీద స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి రూరల్, జూన్ 25: మండలంలోని రామకృష్ణాపురం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో మిగిలిపోయిన ఖాళీల భర్తీలకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం జాన్సన్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 - 25 విద్యాసంవత్సరానికి గాను ఆరు నుంచి 9వ తరగతి వరకు మిగిలిన ఉన్న ఖాళీ సీట్లకు ఈనెల 28వ తారీఖు నందు ప్రవేశ పరీక్ష జరపనున్నట్టు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

కేవీఆర్ మార్ట్‌ను సీజ్‌చేసిన మున్సిపల్ అధికారులు

సత్తెనపల్లి, జూన్ 25: పట్టణంలోని వావిలాల కాంప్లెక్స్‌లో నిర్మించిన కేవీ ఆర్ మార్ట్‌ను మంగళవారం మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. మార్టును నిర్వహిస్తు న్న వైసీపీ నేత కల్లం విజయభాస్కర్‌రెడ్డి పురపాలక సంఘానికి రూ.2 లక్షల వరకు అద్దె బకాయి చెల్లించాల్సి ఉంది. బకాయి చెల్లించాలని పలుమార్లు మున్సి పల్ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ విజయ భాస్క ర్‌రెడ్డి స్పందించకపోవటంతో మున్సిపల్ అధికారులు ఆ దుకాణాన్ని సీజ్ చేసి నోటీ సులు అంటించారు. విజయభాస్కర్‌రెడ్డి వైసీపీ నాయకుడు కావటంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో తన అధికారాన్ని వినియోగించి పురపాలక సంఘానికి చెల్లిం చాల్సిన అద్దె చెల్లించకపోవటంతో పురపాలక సంఘానికి రూ.2లక్షలు అద్దె బకాయి పేరుకుపోయింది. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించి మార్టును సీజ్ చేశారు.